


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 156 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం శుక్రవారం 17 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 156 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM FRI 17 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## ఏపీలో ఇంటింటి గణన ప్రారంభం...

### స్వయంగా తన వివరాలు నమోదు చేసుకున్న సీఎం చంద్రబాబు

- ఏపీలో ఇంటింటి గణన, గృహాల జాబితా సేకరణ ప్రారంభం
- స్వీయ నమోదు ప్రక్రియను ఆరంభించిన సీఎం చంద్రబాబు
- ఆన్‌లైన్‌లో తన వివరాలను స్వయంగా నమోదు చేసుకున్న ముఖ్యమంత్రి
- మొత్తం 33 ప్రశ్నలతో కూడిన సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ
- ఈ నెల 30వ తేదీ వరకు ప్రజలు వివరాలు నమోదు చేసుకునే అవకాశం



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో గురువారం ప్రారంభమైన స్వీయ జనగణన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. హౌస్ లిస్టింగ్–హౌస్ సెన్సెస్ ప్రక్రియలో భాగంగా, తొలి వ్యక్తిగా తన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

మిగతా 2లో

## గృహిణులకు రూ.2,500, నిరుద్యోగులకు రూ.4,000...

### భారీ హామీలతో 'టీవీకే' మానిఫెస్టో ఆవిష్కరించిన విజయ్

- 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం టీవీకే మేనిఫెస్టో విడుదల
- గృహిణులకు నెలకు రూ.2,500, నిరుద్యోగ భృతిగా రూ.4,000 హామీ
- ఏడాదికి 6 గ్యాస్ సిలిండర్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- పాలన, విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం
- తమిళనాడును డ్రగ్ ఫ్రీ రాష్ట్రంగా మార్చడమే లక్ష్యం

మిగతా 2లో





## లోక్‌సభలో.. గరం గరం!


### మూడు కీలక బిల్లులు ప్రవేశపెట్టిన కేంద్రం

- మహిళా రిజర్వేషన్లు, రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్ బిల్లు
- మెజార్టీ సభ్యుల మద్దతుతో చర్చకు ఆమోదం
- సుమారు 15 నుంచి 18 గంటల పాటు చర్చ సాగే అవకాశం
- దీనిపై నేడు సాయంత్రం 4 గంటలకు ఓటింగ్
- మహిళా బిల్లును వ్యతిరేకించిన అసదుద్దీన్ ఒవైసీ
- బిల్లు ఆమోదానికి తొందరెందుకన్న అఖిలేష్ యాదవ్
- ఇప్పటికే తమ అభిప్రాయం చెప్పామన్న సోనియా గాంధీ
- ఎప్పుడో ఆమోదం పొందిన బిల్లుపై మళ్లీ చర్చా.. ప్రధాని మోదీని నిలదీసిన ఎంపీ కేసీ వేణుగోపాల్
- ఘాటుగా కౌంటర్ ఇచ్చిన హోమ్ మంత్రి అమిత్ షా

పెన్ పవర్ డెస్క్:కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై (నారీ శక్తి వందన్ అధినియం) పార్లమెంటులో వాడివేడి చర్చ జరిగింది. ఈ బిల్లులో ఓబీసీ, ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా కల్పించాలన్న డిమాండ్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ మధ్య తీవ్ర వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. ఈ చర్చలో అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ.. మహిళలకు కేటాయించిన 33శాతం రిజర్వేషన్లలో వెనుకబడిన వర్గాలు (ఓబీసీ), ముస్లిం మహిళలకు ప్రత్యేకంగా ఉప-కోటా కేటాయించాలని డిమాండ్ చేశారు. అప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అఖిలేశ్ డిమాండ్‌పై అమిత్ షా తీవ్రంగా స్పందించారు. భారత రాజ్యాంగం ప్రకారం మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడం అసాధ్యమని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే విపక్షాలు ఇలాంటి డిమాండ్లు చేస్తున్నాయని విమర్శించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తికి ఇది పూర్తిగా విరుద్ధమని ప్రభుత్వం తరపున

మిగతా 2లో

పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు కీలక బిల్లులపై చర్చించేందుకు లోక్సభ లాంఛనంగా ఆమోదం తెలి పింది. మహిళా రిజర్వేషన్లు, నియోజక వర్గాల పునర్విభజన తదితర అంశా లతో కూడిన ఈ బిల్లులపై సభలో సభ్యులు సుదీర్ఘంగా చర్చలు జరపను న్నారు.కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసు కువచ్చిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, డీలిమిటేషన్ బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లులకు ఈ చర్చల జాబితాలో చోటు దక్కింది. ఈ బిల్లులపై విపక్ష, అధికార పక్ష సభ్యుల వాడివేడి చర్చల అనంతరం (శు క్రవారం) సాయంత్రం సరిగ్గా 4 గంటలకు మూడు బిల్లులపైన ఓటింగ్ నిర్వహి చనున్నట్లు స్పీకర్ ఓం బిర్లా అధికారి కంగా ప్రకటించారు.



## తెలంగాణలో టాప్ 3 కులాలు ఇవే...

### నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం

- తెలంగాణ కుల సర్వే అధికారిక గణంకాలను విడుదల చేసిన ప్రభుత్వం
- రాష్ట్రంలో 56.36 శాతంతో బీసీలదే అగ్రస్థానం అని వెల్లడి
- జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో
- ఓసీల్లో రెడ్డి, ఎస్టీల్లో లంబాడీల జనాభా అత్యధికం
- దాదాపు 4 శాతం మంది ప్రజలు తమకు కులం లేదని వెల్లడించిన వైనం

మిగతా 2లో



## అనిల్ అంబానీకి సుప్రీంకోర్టులో చుక్కెదురు

- రిలయన్స్ కమ్యూనికేషన్స్ రుణ ఖాతాలను మోసపూరిత ఖాతాలుగా ప్రకటించిన బ్యాంకులు
- మోసపూరిత ఖాతాల విషయంలో చర్యలకు అనుమతించిన బాంబే హైకోర్టు
- సుప్రీంకోర్టులో సవాల్ చేసిన అనిల్ అంబానీ

పెన్ పవర్ డెస్క్: రిలయన్స్ కమ్యూనికేషన్స్ గ్రూప్ కంపెనీల రుణ ఖాతాలను మోసపూ రితమైనవిగా పేర్కొనడాన్ని సవాల్ చేస్తూ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

మిగతా 2లో

## ఏపీలో భగ్గుమన్న సూరీడు.. నంద్యాలలో 45.1 డిగ్రీలు.. నేడు మరింత తీవ్రత!

- ఏపీలో రికార్డు స్థాయికి ఉష్ణోగ్రతలు
- నంద్యాల జిల్లాలో 45.1 డిగ్రీలకు చేరిన గరిష్ఠ ఉష్ణోగ్రత
- పలు జిల్లాల్లో 44 డిగ్రీలు దాటే అవకాశం ఉందని అంచనా
- రాష్ట్రంలోని 85 మండలాల్లో వడగాలులు వీస్తాయని హెచ్చరిక
- ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించిన విపత్తుల నిర్వహణ సంస్థ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మండిపోతున్నాయి. గురువారం నాడు రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నంద్యాల జిల్లా సంజామలలో అత్యధికంగా 45.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవగా, కడప జిల్లా ఒంటిమిట్టలో 44.9 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. రాష్ట్రంలో

మిగతా 2లో





## నారీ శక్తి చట్టం చరిత్రాత్మకం

- మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మక ముందడుగు అని కొనియాడిన పవన్
- మహిళా సాధికారతకు జనసేన పార్టీ కట్టుబడి ఉందని స్పష్టీకరణ
- వివిధ రంగాల్లో రాణిస్తున్న భారత మహిళల విజయాలను ప్రస్తావించిన పవన్
- నారీశక్తి అనేది నినాదం కాదని, మన నాగరికతకు బలమని వ్యాఖ్య
- రాజ్యాంగ రూపకల్పనలో మహిళల పాత్రను గుర్తు చేసుకున్న జనసేనాని

మిగతా 2లో

## జగన్ బతుకే ఒక అరాచకం

### మంత్రి కొల్లు రవీంద్ర ఫైర్

- ఐదేళ్లు జువ్వలదిన్నె హార్బర్‌ను అడ్డుకున్నది జగనే అని ఆరోపణ
- మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీశారని ఘాటు వ్యాఖ్యలు
- దేశ రక్షణ సంస్థను వ్యతిరేకించడం జగన్ దుర్మార్గపు ఆలోచన అని ఘాటు విమర్శలు
- గొడ్డలి రాజకీయమే జగన్ విధానమని తీవ్ర స్థాయిలో ధ్వజం

మిగతా 2లో





## ప్రభుత్వ పాఠశాలల పనులు ఇకపై ఎస్ఎంసీలకే...

- పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష
- అన్ని ప్రభుత్వ స్కూళ్లను 3 స్టార్‌కు చేర్చాలని ఆదేశం
- ప్రవేశాల పెంపునకు డోర్ టు డోర్ క్యాంపెయిన్‌కు పిలుపు
- ప్రభుత్వ కాలేజీల్లో టాపర్లకు విస్తృత ప్రచారం కల్పించాలని సూచన

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చే దిశగా విద్యాశాఖ మం త్రి నారా లోకేష్ కీలక ఆదేశాలు జారీ చేశారు.

మిగతా 2లో



## మహిళా బిల్లుతో దేశ రాజకీయాల దిశ, దశ మారతాయి

- లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- బిల్లుపై మూజువాణి ఓటింగ్‌ను వ్యతిరేకించి డివిజన్‌కు పట్టుబట్టిన విపక్షాలు
- ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 251, వ్యతిరేకంగా 185 ఓట్లు
- బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని పార్టీలకు ప్రధాని విజ్ఞప్తి

మిగతా 2లో



## రేవంత్ రెడ్డి వాదన విని తెలంగాణ ప్రజలు నవ్వుతున్నారు

- డీలిమిటేషన్‌కు జీఎస్‌డీపీని ముడిపెట్టడం మూర్ఖత్వమన్న తేజస్వీ సూర్య
- నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని హామీ
- ఏపీ, తెలంగాణలను కాంగ్రెస్ విభజించిన తీరు బ్రిటీష్ కంటే దారుణంగా ఉందని వ్యాఖ్య
- కాంగ్రెస్ చేసిన విభజన కారణంగా ఏపీ, తెలంగాణ మధ్య నేటికీ ఘర్షణ వాతావరణం ఉందన్న ఎంపీ

మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## అనిల్ అంబానీకి సుప్రీంకోర్టులో చుక్కెదురు

- మొదటి పేజి తరువాయి

రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు చెందిన మోసపూరిత ఖాతాల విషయంలో చర్యలకు బాంబే హైకోర్టు అనుమతించడాన్ని ఆయన సవాల్ చేయగా, సుప్రీంకోర్టులో చుక్కెదురైంది.
ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తన నిర్ణయాన్ని ప్రకటించింది. అయితే బ్యాంకులిచ్చిన షోకాజ్ నోటీసులపై హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ వద్ద తన వాదనలు వినిపించుకోవడానికి అనిల్ అంబానీకి అనుమతిచ్చింది. ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని హైకోర్టుకు సూచించింది.
బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, ఐడీబీఐ బ్యాంకులు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఖాతాలను మోసపూరితమైనవిగా ప్రకటించాయి. బ్యాంకులు చేసిన ప్రకటనపై అనిల్ అంబానీ బాంబే హైకోర్టులో సవాల్ చేశారు. విచారించిన హైకోర్టు సింగిల్ బెంచ్, వాటిపై స్టే విధించడంతో పాటు భవిష్యత్తులో చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇచ్చింది. మోసపూరిత ఖాతాలుగా గుర్తించే విషయంలో ఆర్బీఐ మార్గదర్శకాలు పాటించలేదని పేర్కొంది.దీనితో మూడు బ్యాంకులు అప్పీలుకు వెళ్లాయి. విచారించిన హైకోర్టు డివిజన్ బెంచ్, సింగిల్ బెంచ్ ఉత్తర్వులను కొట్టివేసింది. ఈ క్రమంలో అనిల్ అంబానీ డివిజన్ బెంచ్ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయగా, చుక్కెదురైంది.

## తెలంగాణలో టాప్ 3 కులాలు ఇవే...
## నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వేకు సంబంధించిన అధికారిక గణంకాలను విడుదల చేసింది. ఈ సర్వే ప్రకారం రాష్ట్ర జనాభాలో వెనుకబడిన తరగతులు (బీసీలు) 56.36 శాతంతో అతిపెద్ద సామాజిక వర్గంగా నిలిచారు. జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. దేశంలోనే ఆదర్శవంతంగా, అత్యంత పారదర్శకంగా ఈ సర్వే ప్రక్రియను పూర్తి చేశామని ప్రభుత్వం ప్రకటించింది.ఈ భారీ కసరత్తు కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.03 లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేశారు. ప్రజల నుంచి 'సెల్ఫ్ డిక్లరేషన్' పద్ధతిలో వివరాలను సేకరించారు. ఈ సర్వేలో భాగంగా మొత్తం 1,12,36,849 కుటుంబాలను సర్వే బృందాలు సందర్శించి, 3,55,50,759 మంది జనాభా వివరాలను నమోదు చేసినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో తెలిపింది.

**సామాజిక వర్గాల వారీగా జనాభా వాటా**

సర్వే ఫలితాల ప్రకారం, రాష్ట్ర జనాభాలో బీసీల తర్వాత షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు) 17.42 శాతం, అగ్రవర్ణాలు (ఓసీలు) 15.79 శాతం, షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) 10.43 శాతం చొప్పున ఉన్నారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సుమారు 4 శాతం మంది ప్రజలు తమకు ఎలాంటి కులం లేదని (చీశీ ఝుర్వ) తమ డిక్లరేషన్‌లో పేర్కొనడం గమనార్హం.

**కులాల వారీగా ప్రధాన వర్గాలు**

రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కులాల జాబితాను పరిశీలిస్తే, 36.58 లక్షల మందితో (10.3 శాతం) మాదిగ సామాజిక వర్గం మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత 27.96 లక్షల మందితో (7.9 శాతం) షేక్ ముస్లింలు రెండో స్థానంలో, 26.39 లక్షల జనాభాతో (7.4 శాతం) ముదిరాజ్ సామాజిక వర్గం మూడో స్థానంలో ఉన్నాయి.
ఓసీ వర్గాల్లో: రెడ్డి సామాజిక వర్గం 4.8 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో కోమటి (1.4 శాతం), కమ్మ (1.0 శాతం), బ్రాహ్మణ (0.9 శాతం), కాపు/నాయుడు (0.7 శాతం), వెలమ (0.4 శాతం) ఉన్నారు.
బీసీ వర్గాల్లో: షేక్ ముస్లింలు (7.9 శాతం) అత్యధిక జనాభాతో ముందుండగా, ముదిరాజ్ (7.4 శాతం), యాదవ (5.7 శాతం), గౌడ్ (4.6 శాతం), మున్నూరుకాపు (3.9 శాతం) తర్వాతి స్థానాల్లో నిలిచారు.
ఎస్సీ వర్గాల్లో: మాదిగ (10.3 శాతం) సామాజిక వర్గం అత్యధిక జనాభా కలిగి ఉండగా, మాల (4.1 శాతం), బేడా (0.5 శాతం), మాల సేల్ (0.5 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.
ఎస్టీ వర్గాల్లో: లంబాడీలు 6.8 శాతం జనాభాతో అగ్రస్థానంలో నిలిచారు. కోయ (1.2 శాతం), గోండ్ (1.1 శాతం), ఎరుకుల (0.5 శాతం) వారి తర్వాత ఉన్నారు.
ఈ సర్వే ద్వారా వెల్లడైన గణంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల రూపకల్పన, రాజకీయ సమీకరణాల్లో కీలక పాత్ర పోషించనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఏపీలో ఇంటింటి గణన ప్రారంభం...

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా ప్రజలందరూ ఈ ప్రక్రియలో భాగస్వాములై, రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.అమరావతిలోని తన నివాసంలో ంవ.ఎవఅంబం.స్త్రశీజ.ఱఅ వెబ్ సైట్ ద్వారా చంద్రబాబు వ్యక్తిగత వివరాలను నమోదు చేశారు. మొత్తం 33 ప్రశ్నలతో కూడిన ఈ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను ఏపీ జనగణన డైరెక్టర్ జె. నివాస్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రజలు స్వయంగా ఆన్‌లైన్‌లో తమ ఇళ్ల వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని, మే 1 నుంచి 30 వరకు ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వచ్చి భౌతికంగా వివరాలు సేకరిస్తారని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలోని పౌరులందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు సమానంగా అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దీనికోసం కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం అవసరమని, ఈ లక్ష్య సాధనలో జనగణన కార్యక్రమం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో జనగణన జరగడం ఇదే తొలిసారి అని, ఇది కేవలం సమాచార సేకరణ మాత్రమే కాదని, రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని అభిప్రాయపడ్డారు.జనాభా లెక్కల కార్యక్రమం రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశలో భాగంగా ప్రస్తుతం ఇళ్ల గణన ప్రారంభమైందని, వచ్చే ఏడాది రెండో దశలో జనాభా లెక్కల సేకరణ చేపడతారని సీఎం వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ నమోదు అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ సరైన వివరాలు నమోదు చేసి ఈ బృహత్కార్యాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఏపీలో భగ్గుమన్న సూరీడు..
## నంద్యాలలో 45.1 డిగ్రీలు..

- మొదటి పేజి తరువాయి

ఎండల తీవ్రతకు ఇది అద్దం పడుతోంది.ఈ నేపథ్యంలో, రాబోయే 24 గంటల్లోనూ ఎండల తీవ్రత కొనసాగుతుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరించింది. శుక్రవారం (ఏప్రిల్ 17) కూడా పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు భారీగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ముఖ్యంగా మన్యం, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరుతో పాటు రాయలసీమ జిల్లాల్లో గరిష్ఠంగా 43 నుంచి 44.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే సూచనలు ఉన్నాయని పేర్కొంది.అంతేకాకుండా, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని ఏపీఎస్డీఎంఏ హెచ్చరించింది. మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి, పోలవరం ప్రాంతాల్లోని సుమారు 30 మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 55 మండలాల్లో సాధారణ వడగాలులు వీచే అవకాశం ఉందని అంచనా వేసింది.ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా మధ్యాహ్నా వేళల్లో బయటకు వెళ్లవద్దని సూచించింది. వృద్ధులు, చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

# లోక్‌సభలో.. గరం గరం!

- మొదటి పేజి తరువాయి

ఆయన గట్టిగా వాదించారు. ఈ బిల్లును వెంటనే అమలు చేయకుండా జనాభా గణన (సెన్సస్), నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే అమలు చేస్తామని చెప్పడంపైనా విపక్షాలు అభ్యంతరం తెలిపాయి. ప్రభుత్వం కావాలనే కాలయాపన చేస్తోందని అఖిలేశ్ యాదవ్‌తో పాటు ఇతర ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం కాగా, ఓబీసీ, ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా లేకపోవడమే ప్రస్తుత వివాదానికి కేంద్ర బిందువుగా మారింది.

**మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన అసదుద్దీన్ ఒవైసీ**

పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లును మజ్లిస్ పార్టీ వ్యతిరేకించింది. పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ఈ రోజు మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టింది. సభలో వివిధ పార్టీలు డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకించాయి. మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించారు.
ఈ బిల్లును నిరసిస్తూ ఆయన సాహిర్ లుధియాన్వి రాసిన ఒక కవితను లోక్ సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ బిల్లును సభలో ప్రవేశపెట్టడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ చర్య మహిళా రిజర్వేషన్‌కు సంబంధించినది కాదని, ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచివేసే చర్య అని ఆరోపించారు. ఈ బిల్లు జనాభా ఎక్కువగా ఉన్నరాష్ట్రాలకు మరింత అధికారం ఇస్తుందని అన్నారు.
డీలిమిటేషన్ బిల్లుపై ఆయన మాట్లాడుతూ, బిల్లు ప్రజాస్వామ్య, సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఉందని విమర్శించారు. దక్షిణాది ప్రాంతాలకు సభలో ప్రాతినిధ్యం లేకుండా ఈ బిల్లు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, డీలిమిటేషన్ బిల్లును కాంగ్రెస్, ఎస్పీ, డీఎంకే సహా వివిధ పార్టీలు వ్యతిరేకించాయి.

## గృహిణులకు రూ.2,500, నిరుద్యోగులకు రూ.4,000...
## భారీ హామీలతో 'టీవీకే' మానిఫెస్టో ఆవిష్కరించిన విజయ్

నటుడి నుంచి రాజకీయ నేతగా మారిన విజయ్, తన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీని రాబోయే ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా, భారీ సంక్షేమ పథకాలు, టెక్నాలజీ ఆధారిత పాలన హామీలతో కూడిన పార్టీ మేనిఫెస్టోను గురువారం సాయంత్రం విడుదల చేశారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా, సామాజికంగా పునర్నిర్మించేందుకు రంగాలవారీగా సంస్కరణలు చేపడతామని ప్రకటించారు. సంప్రదాయ సంక్షేమ పథకాలతో పాటు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతను పాలనలో ప్రవేశపెట్టడం ద్వారా వినూత్న మార్పునకు శ్రీకారం చుడతామని విజయ్ స్పష్టం చేశారు.ప్రజాకర్షక పథకాలకు మేనిఫెస్టోలో పెద్దపీట వేశారు. గృహిణులకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులకు రూ.4,000, డిప్లొమా హోల్డర్లకు ?2,500 భృతి అందిస్తామని హామీ ఇచ్చారు. యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఐదు లక్షల మందికి రూ.18,000 చొప్పున ఉపాధి ఆధారిత మద్దతు పథకాన్ని ప్రకటించారు. దీంతో పాటు, ఇంటర్న్‌షిప్ చేసే యువతకు రూ.5,000 నుంచి రూ.8,000 వరకు స్టైఫండ్ ఇస్తామని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అందించే పింఛనును నెలకు రూ.3,000కు పెంచుతామని, దాదాపు 15 లక్షల మందికి ఈ ప్రయోజనం చేకూరుస్తామని పేర్కొన్నారు.మహిళా సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, పేద యువతుల వివాహానికి ఒక సవర బంగారం, పట్టు చీరతో కూడిన ఆర్థిక సహాయం అందిస్తామని వాగ్దానం చేశారు. ప్రభుత్వ భూముల్లో అర్హులైన వారికి ఉచితంగా ఇంటి పట్టాలు ఇస్తామన్నారు.
ఆరోగ్య రంగంలో ఉచిత వైద్య పరీక్షలు, తక్కువ ధరలకే మందులు, క్యాన్సర్ బాధితుల కోసం ప్రత్యేక బీమా సౌకర్యం కల్పిస్తామని టీవీకే హామీ ఇచ్చింది. ప్రాథమిక సేవలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ, ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు, ఏడాదికి ఆరు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేస్తామని ప్రకటించారు. రైతులకు అండగా నిలుస్తూ, ఐదు ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతుల రుణాల్లో 50 శాతం మాఫీ చేస్తామని, సౌరశక్తి ప్రాజెక్టులను ప్రోత్సహిస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచారు. మత్స్యకారులకు కనీస మద్దతు ధర, చేపల వేట లేని సమయంలో రూ.27,000 ఆర్థిక సహాయం, రూ.25 లక్షల బీమా కవరేజీ కల్పిస్తామన్నారు.ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి అంగన్‌వాడీ సిబ్బందికి రూ.18,000, పారిశుద్ధ్య కార్మికులకు రూ.10,000 వేతనం, దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు రూ.15 లక్షల ప్రయోజనం కల్పిస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్రంలో శాంతిభద్రతలకు ప్రాధాన్యత ఇస్తూ, "డ్రగ్-ఫ్రీ తమిళనాడు" కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని విజయ్ ప్రకటించారు. ఆర్థికంగా, 2036 నాటికి తమిళనాడును 1.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం రూ.15,000 కోట్లతో భద్రతా నిధిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ మేనిఫెస్టో ద్వారా సంక్షేమ పథకాలను, టెక్నాలజీ ఆధారిత అభివృద్ధిని జోడించి ఏప్రిల్ 23న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు టీవీకే సిద్ధమవుతోంది.

## రేవంత్ రెడ్డి వాదన విని
## తెలంగాణ ప్రజలు నవ్వుతున్నారు

డీలిమిటేషన్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వితండవాదం చేస్తున్నారని, ఆయన చెబుతున్నది విని తెలంగాణ ప్రజలు కూడా నవ్వుతున్నారని బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య అన్నారు. రాష్ట్రాల జీఎస్‌డీపీ ఆధారంగా లోక్ సభ సీట్ల సంఖ్యను పెంచాలన్న రేవంత్ రెడ్డి ప్రతిపాదనపై ఆయన మండిపడ్డారు. సీట్ల పెంపునకు, జీఎస్‌డీపీ ముడిపెట్టాలన్న తెలంగాణ సీఎం సలహా అత్యంత మూర్ఖంగా ఉందని అన్నారు. అసలు ఆయనకు ఆ సలహా ఎవరిచ్చారో కానీ అందరూ నవ్వుతున్నారని చురక అంటించారు. లోక్ సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న విపక్ష పార్టీలు, దక్షిణాది పార్టీల వ్యాఖ్యలను సూర్య తప్పుబట్టారు. డీలిమిటేషన్‌పై విపక్షాల వాదన అర్థరహితంగా ఉందని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని హామీ ఇచ్చారు. డీలిమిటేషన్‌పై ప్రతిపక్షాలు దక్షిణాది రాష్ట్రాల ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాల ఆదాయం అనేది ప్రతి సంవత్సరం మారుతుందని తెలిపారు. దానిని డీలిమిటేషన్‌కు ప్రాతిపదికగా తీసుకోవాలని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. ఆదాయం ప్రకారం ఓట్లు లేదా ప్రాతినిధ్యం ఇవ్వాలనుకుంటే దేశంలో అత్యధిక ఆదాయం ఉన్న అంబానీకి లక్ష ఓట్లు ఇవ్వవలసి వస్తుందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వాలు మహిళా రిజర్వేషన్ బిల్లును పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పుడు కూడా మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడానికే చూస్తున్నాయని అన్నారు. డీలిమిటేషన్‌ను సాకుగా చూపి మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వేగంగా అమలు చేద్దామంటే విపక్షాలు యూటర్న్ తీసుకుంటున్నాయని అన్నారు.కాంగ్రెస్ నాడు అత్యంత దారుణంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలను విభజించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ చేసిన విభజన బ్రిటిష్ వారి కంటే దారుణంగా ఉందని అన్నారు. ఏపీ, తెలంగాణ విభజనను కాంగ్రెస్ పాకిస్థాన్, భారత్ విభజనతో పోల్చారు. విభజన సమయంలో కాంగ్రెస్ అనుసరించిన విధానం వల్ల రెండు రాష్ట్రాల మధ్య నేటికీ ఘర్షణ వాతావరణం నెలకొందని ఆన్నారు.

## జగన్ బతుకే ఒక అరాచకం

వైసీపీ అధినేత జగన్ నిన్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యల పట్ల మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో స్పందించారు. జగన్ బతుకే ఒక అరాచకమని, ఆయనకు అభివృద్ధి చేయడం తెలియదని, గొడ్డలి రాజకీయమే తెలుసని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుండటాన్ని చూసి ఓర్వలేకే జగన్ కులాల మధ్య చిచ్చుపెట్టి అల్లర్లు సృష్టించాలని చూస్తున్నారని ఆరోపించారు. గురువారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ విషయంలో జగన్ దుష్ప్రచారం చేస్తున్నారని రవీంద్ర మండిపడ్డారు. "ఐదేళ్ల పాటు నిధులు, బిల్లులు ఇవ్వకుండా హార్బర్ నిర్మాణాన్ని అడ్డుకుని, మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసింది జగన్. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు వేగవంతం చేసి, 901 మీటర్ల జెట్టీ, కోల్డ్ స్టోరేజ్‌లతో ఆధునిక హార్బర్‌గా పూర్తి చేస్తుంటే.. మత్స్యకారులను రెచ్చగొట్టేలా అసత్యాలు మాట్లాడుతున్నారు" అని విమర్శించారు.

**దేశ రక్షణ సంస్థపై జగన్ వైఖరి దుర్మార్గం**

జువ్వలదిన్నెలో దేశ రక్షణకు కీలకమైన 'సాగర్ డిఫెన్స్' సంస్థకు కేంద్ర అనుమతితో భూమి కేటాయిస్తే, దానిని తరిమికొడతాననడం జగన్ దుర్మార్గపు ఆలోచనకు నిదర్శనమని కొల్లు రవింద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "తల్లి, చెల్లిని వెళ్లగొట్టారు, సొంత బాబాయినే వేసేశారు. ఇప్పుడు దేశ రక్షణ సంస్థను కూడా తరిమికొడతానంటున్నారు. అంటే జగన్‌కు దేశం మీద కూడా భక్తి లేదు. ఆయనకు తెలిసింది గొడ్డలి పార్టీ, గొడ్డలి గుర్తు.. నరుక్కుంటూ పోవడమే" అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

**అభివృద్ధి, పెట్టుబడులకు జగన్ శత్రువు**

గత ఐదేళ్లలో 800 పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమికొట్టిన చరిత్ర జగన్‌దని రవింద్ర ఆరోపించారు. "కియా, అమరరాజా వంటి సంస్థలను బెదిరించి పొరుగు రాష్ట్రాలకు పంపారు. ఇప్పుడు చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి వస్తుంటే చూసి ఓర్వలేకపోతున్నారు. నేను వస్తే చట్టాలు మార్చేస్తానంటూ పెట్టుబడిదారులను మళ్లీ భయపెట్టాలని చూస్తున్నారు. విధ్వంసమే నైజంగా ఉన్న జగన్‌ను ప్రజలు నమ్మకే 11 సీట్లకు పరిమితం చేశారు" అని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, జీవో 217ను రద్దు చేసి, వేట నిషేధ భృతిని పెంచి, వారికి అండగా నిలుస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

**తమిళనాడు బోట్ల విడుదల అంశంలో జగన్ దుష్ప్రచారం**

తమిళనాడు మత్స్యకారుల బోట్లను పట్టుకున్న తర్వాత, వాటిని యువనేత నారా లోకేశ్ చెప్పడం వల్లే పోలీసులు విడుదల చేశారని జగన్ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం, దురదృష్టకరం అని కొల్లు రవీంద్ర కొట్టిపడేశారు. ఈ అంశాన్ని రాజకీయంగా మార్చి లబ్ది పొందాలని జగన్ ప్రయత్నించడం బాధాకరమని అన్నారు. వాస్తవానికి, ఈ బోట్ల విషయంలో స్థానిక గ్రామాల ప్రజలు జోక్యం చేసుకున్నారని వెల్లడించారు. "ఇది మా గ్రామాల మధ్య ఉన్న సమస్య. మేమే చర్చించుకుని పరిష్కరించుకుంటాం" అని వారు కోరారని తెలిపారు. వారి అభిప్రాయాన్ని, ఐక్యతను గౌరవిస్తూ, వారి నిర్ణయం ప్రకారమే మేము ముందుకు వెళ్లాం... అంతేకానీ, ఇందులో లోకేశ్ గారి ప్రమేయం ఉందనడం పచ్చి అబద్ధం అని కొల్లు రవీంద్ర వివరించారు."నిజానికి, సముద్ర గస్తీ విషయంలో గత జగన్ ప్రభుత్వ హయాంలోనే తీవ్ర నిర్లక్ష్యం జరిగింది. 2017 వరకు ఇతర రాష్ట్రాల బోట్లు రాకుండా మెరైన్ బోట్లు గస్తీ కాస్తుండేవి. కానీ 2019 తర్వాత ఆ గస్తీ పూర్తిగా నిలిచిపోయింది. బోట్ల రిపేర్లు, మెయింటెనెన్స్‌కు నిధులు ఇవ్వకపోవడం, సిబ్బందిని తొలగించడం వంటి చర్యలతో సముద్ర సరిహద్దులు బలహీనపడ్డాయి. ఆ కారణంగానే తమిళనాడు బోట్లు మన సముద్ర జలాల్లోకి చొరబడి మత్స్య సంపదను దోచుకుపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని గుర్తించిన వెంటనే చంద్రబాబు నాయుడు గారు, నారా లోకేశ్ గారు అధికారులను అప్రమత్తం చేశారు. తక్షణమే 650 హార్స్ పవర్ ఇంజిన్లతో కూడిన స్పీడ్ బోట్లను ఏర్పాటు చేసి గస్తీని పటిష్టం చేశాం. అక్రమంగా ప్రవేశిస్తున్న బోట్లను నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాం.
వాస్తవాలు ఇలా ఉంటే, జగన్ మాత్రం నిజాన్ని దాచిపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు" అని కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు.

## నారీ శక్తి చట్టం చరిత్రాత్మకం

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తీసుకువచ్చిన 'నారీ శక్తి వందన్ అధినియం సవరణ బిల్లు' ఒక చరిత్రాత్మక ముందడుగు అని ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా పాలనలో వారికి సముచిత స్థానం దక్కుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా సాధికారతకు జనసేన పార్టీ మాటలతో కాకుండా చేతలతో ఎప్పుడూ మద్దతుగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్న పవన్ కల్యాణ్, "2019 ఎన్నికల్లో మేము వాగ్దానం చేసినట్లుగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల పట్ల మా నిబద్ధత, సమాన అవకాశాలు, సరైన ప్రాతినిధ్యంపై మాకున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది" అని తెలిపారు. మహిళలు సమాజానికి పునాది అని, కుటుంబాలను తీర్చిదిద్దడం నుంచి దేశ నిర్మాణంలో పాలుపంచుకోవడం వరకు వారి పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. "మహిళ ఎదిగితే దేశం ఎదుగుతుంది. ఇది వారికి కొత్త హక్కులు ఇవ్వడం కాదు, వారికి న్యాయంగా చెందాల్సిన వాటిని తిరిగి ఇవ్వడం. బలమైన మహిళలు బలమైన కుటుంబాలను నిర్మిస్తారు. బలమైన కుటుంబాలు బలమైన దేశాన్ని నిర్మిస్తాయి. ఇకపై 'నారీ శక్తి' కేవలం నినాదం కాదు, మన నాగరికతకు బలంగా నిలుస్తుంది. న్యాయమైన, సమానమైన, సాధికారత కలిగిన భారతదేశాన్ని నిర్మించడానికి ఈ స్ఫూర్తితో ముందుకు సాగుదాం" అని పవన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న భారత మహిళల విజయాలను ఆయన కొనియాడారు. సైప్రస్‌లో జరిగిన ఉమెన్స్ క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో గెలిచి, ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌కు సవాల్ చేసే హక్కును పొందిన తొలి భారతీయ మహిళగా ఆర్. వైశాలి చరిత్ర సృష్టించడాన్ని ప్రస్తావించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఇస్రో శాస్త్రవేత్త రీతూ కరిధాల్ నుంచి ఒలింపిక్స్‌లో పీవీ సింధు, మీరాబాయి చాను, బాక్సింగ్‌లో నిఖత్ జరీన్ వరకు ఎందరో మహిళలు దేశానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన దాక్షాయణి వేలాయుధన్, హంసా మెహతా, దుర్గాబాయి దేశ్‌ముఖ్, విజయలక్ష్మీ పండిట్, రాజకుమారి అమృత్ కౌర్ వంటి వారి సేవలను పవన్ గుర్తు చేసుకున్నారు. "ప్రతిభకు అవకాశం తోడైనప్పుడు, మహిళలు నాయకత్వం వహిస్తారు, రాణిస్తారు, దేశాలకు స్ఫూర్తిగా నిలుస్తారని ఈ విజయాలన్నీ నిరూపిస్తున్నాయి" అని ఆయన పేర్కొన్నారు.

## మహిళా బిల్లుతో దేశ రాజకీయాల
## దిశ, దశ మారతాయి

మహిళా రిజర్వేషన్ బిల్లు దేశ రాజకీయాల దిశ, దశను మార్చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ జనాభాలో సగభాగమైన మహిళలు నిర్ణయాధికార ప్రక్రియలో పాలుపంచుకోవడం ద్వారా దేశానికి కొత్త దిశానిర్దేశం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కీలక బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు.
కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్... రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026, డీలిమిటేషన్ బిల్లు, 2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, 2026లను సభ ముందు ఉంచారు. అయితే, ఈ బిల్లును ప్రవేశపెట్టే సమయంలో విపక్షాలు మూజువాణి ఓటింగ్‌ను అంగీకరించలేదు. ఓట్ల విభజన (డివిజన్)కు పట్టుబట్టడంతో సభలో ఓటింగ్ నిర్వహించాల్సి వచ్చింది.బిల్లు ప్రవేశపెట్టడానికి అనుకూలంగా 251 ఓట్లు, వ్యతిరేకంగా 185 ఓట్లు పోలైనట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సాధారణంగా లోక్‌సభలో మూజువాణి ఓటు ద్వారానే తీర్మానాలు ఆమోదిస్తారు. కానీ, ఫలితంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పుడు సభ్యుల కోరిక మేరకు డివిజన్ నిర్వహిస్తారు. ఆటోమేటిక్ ఓట్ రికార్డర్ వ్యవస్థ ద్వారా ఈ ప్రక్రియను పూర్తిచేశారు. ఆ తర్వాత ఓటు స్లిప్పుల ద్వారా జరిగిన ఓటింగ్‌లో మొత్తం 333 మంది సభ్యులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, పార్టీలు ఈ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని విజ్ఞప్తి చేశారు. వికసిత భారత్ ఏ2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో మహిళా రిజర్వేషన్లు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. గతంలో ఈ బిల్లును వ్యతిరేకించిన వారికి మహిళా ఓటర్లు తగిన గుణపాఠం చెప్పారని ఆయన వ్యాఖ్యానించారు.

## ప్రభుత్వ పాఠశాలల పనులు
## ఇకపై ఎస్‌ఎంసీలకే...

- మొదటి పేజి తరువాయి

మౌలిక సదుపాయాలకు సంబంధించిన చిన్న పనులను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు అప్పగించి వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఉన్నతాధికారులతో అమరావతిలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 3 స్టార్ మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెయ్యి మందికి పైగా విద్యార్థులున్న 60 పాఠశాలల్లో 5 స్టార్ సౌకర్యాలు ఏర్పాటు చేయడంపై దృష్టి సారించాలన్నారు. లీక్ ప్రూఫ్ భవనాలు, తాగునీరు, టాయిలెట్లు, పెయింటింగ్ వంటి పనులను ఎస్‌ఎంసీలకే అప్పగించాలని సూచించారు. అయితే, మోడల్ ప్రైమరీ స్కూళ్లలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను మాత్రం రాష్ట్ర పాఠశాల మౌలిక సదుపాయాల సంస్థ ద్వారానే చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని లోకేష్ ఆదేశించారు. ఇందుకోసం 'డోర్ టు డోర్' క్యాంపెయిన్ నిర్వహించాలని, ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ ఏడాది 10 శాతం అడ్మిషన్ల పెరుగుదలను లక్ష్యంగా పెట్టుకోవాలని, డ్రాపవుట్లను సున్నా స్థాయికి తీసుకురావాలని స్పష్టం చేశారు.




# ఎమ్మెల్యే మద్దిపాటిని సన్మానించిన బళ్ళ సూర్యచక్రం.



**గోపాలపురం, పెన్ పవర్, ఏప్రిల్ 16.** టిడిపి జోనల్ కోఆర్డినేటర్ గా బాధ్యతలు స్వీకరించిన గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజును రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గం టిడిపి కార్యదర్శి బళ్ళ సూర్యచక్రం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సూర్య చక్రం మాట్లాడుతూ ఎమ్మెల్యే తాను ఒక కార్యకర్తల నిరంతరం ప్రజల్లోనే ఉంటూ ప్రజలకు అవసరమైన సేవలను చేస్తూ ప్రతి ఒక్కరిని ఉత్సాహ పరుస్తూ ఉండడం అభినందనీయం అన్నారు. ప్రతి ఒక్కరిని స్నేహితుడిలా భావించి ఆప్యాయతగా పలకరిస్తూ అన్ని సమయాల్లో మీకు నేను అండగా ఉన్నానంటూ భరోసా ఇస్తూ ఉండడం ఆయనకే చెల్లిందన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి పార్టీనీ మరింత అభివృద్ధి పథంలోనికి తీసుకువెళ్లాలని నియోజకవర్గాన్ని ఒక మోడల్ గా తీర్చిదిద్ది రాష్ట్రంలో నెంబర్ వన్ స్థానంలో నిలపాలన్న ఎమ్మెల్యే కోరిక నెరవేరాలని ఆయన అన్నారు. పార్టీ కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించే ఎమ్మెల్యే వెంకట్రాజు ముందు ముందు మరిన్ని ఉన్నతమైన పదవులను చేపట్టాలని ఆకాంక్షించారు.


## సెన్సెస్ స్వీయ గణనపై కలెక్టర్ ఆదేశాలు

### గ్రామాల్లో అవగాహన కల్పించాలి



**చింతూరు, పన్ పవర్, ఏప్రిల్ 16:**కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సెన్సెస్ స్వీయ గణన 2026, 27 కార్యక్రమంపై సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన పొందాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 16 నుండి 30వ తేదీ వరకు జరుగనున్న ఈ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు. గురువారం చింతూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సచివాలయ సిబ్బంది శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సెన్సెస్ స్వీయ గణనను డిజిటల్ విధానంలో సెల్‌ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పోర్టల్‌లో కుటుంబ సభ్యుల వివరాలను స్వయంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సచివాలయ సిబ్బందికి శిక్షణ సరిగా అర్థమవుతుందో లేదో ఆయన పరిశీలించి, ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చింతూరు మండలం మల్లెతోట గ్రామం, వీఆర్ పురం మండలం పత్తిపాక గ్రామాల్లో ప్రజలతో ముఖాముఖి సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. ఏటపాక మండలంలోని నర్సింగ ఆర్ అండ్ ఆర్ కాలనీని సందర్శించి అక్కడి సమస్యలను పరిశీలించారు. కూనవరం గ్రామంలో పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులతో గ్రామ సభలో పాల్గొని వారి సమస్యలను తెలుసుకున్నారు. బాధితులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం కూనవరం మండలం పైడిగూడెం గ్రామంలో కాటన్ తయారీ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. మహిళలు పొందుతున్న శిక్షణ విధానం, శిక్షణ పొందుతున్న వారి సంఖ్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిక్షణను సరిగా అర్థం చేసుకుని నేర్చుకుంటే మహిళలకు మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. పోలవరం ప్రాజెక్టు ముంపు బాధిత గిరిజనులకు ల్యాండ్ టు ల్యాండ్, గిరిజనేతరులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి శుభం నొక్వాల్, వివిధ మండలాల తహసీల్దారులు, ఎంపీడీవోలు, వివిధ శాఖల ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం దుకాణాల్లో అదనపు బాదుడు





- బాటిల్ కు రూ.20 రూపాయలు అదనంగా వసూళ్ళు
- బార్లుగా మారిన కళ్యాణ మండపాలు ప్రమాదంలో మహిళల భద్రత
- మద్యం దుకాణాల్లో కనపించని పర్మిట్ రూములు
- బ్లాక్ మార్కెటింగ్ కు తరలిస్తున్న చీప్ లిక్కర్
- అపరిశుభ్రత, దుర్వాసనల మధ్య మందుబాబులు ఇబ్బంది
- ముడుపుల మత్తులో పడి పట్టించుకోని ఎక్సైజ్ శాఖ

**రాజమహేంద్రవరం, పెన్ పవర్,ఏప్రిల్ 16:**మరో నాలుగైదు నెలల్లో ఎక్సైజ్ సంవత్సరం ముగుస్తున్న తరుణంలో, మద్యం పాలసీ, లైసెన్సల గడువు తీరిపోతున్న దృష్ట్యా దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే సామెత చందంగా నగరంలోని మద్యం సిండికేట్ దారులు దోపిడీ పర్వానికి తెర తీశారు. కొత్త సంవత్సరం ప్రారంభంలో సుమారు నాలుగు నెలల క్రితం నగర ఎమ్మెల్యేకు, ఎక్సైజ్, పోలీస్ అధికారులకు , మీడియాకు నెలవారి ముడుపులు ముట్ట చెప్పాలనే వంక తో కొంతమంది తెలుగు తమ్ముళ్లు ముఠాగా ఏర్పడి నగరంలోను, రూరల్ పరిధిలోని 40 మద్యం షాపుల నుంచి రూ. 40 లక్షల రూపాయలు వసూళ్లు చేసినట్లుగా ఆరోపణలు రావడం, ప్రతిపక్షాలు సిండికేటుల దోపిడీని దుమ్మెత్తి పోయడంతో వాటిని మద్యం సిండికేట్ దారులు, తెలుగు తమ్ముళ్లు, ఎమ్మెల్యే అనుచరులు ఏ ఐ చేసిన ఆరోపణలుగా తప్పించుకోవడం తెలిసిందే. ఈ ఆరోపణల క్రమంలో కొంతకాలం పాటు గప్ చుప్ గా ఉన్న మద్యం సిండికేట్ దారులు మళ్లీ దోపిడీ పర్వనికి తెరలేపారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలోను, రూరల్ పరిధిలోని సుమారు 40 షాపులు,బార్ లు ఉన్నాయి. బార్ల సంగతి ఎలా ఉన్నా మద్యం షాపుల్లో క్వాటర్ బాటిల్ కు రూ.20 రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నట్లుగా మద్యం బాబులు గగ్గోలు పెడుతున్నారు. బ్రాండెడ్ మద్యంపై అదనపు 20 రూపాయలు వసుళ్ళు ఎలా ఉన్న, కూలి నాలి చేసుకొని రోజంతా కష్టపడి రూ. 400 లో రూ.500 లో సంపాదించుకున్న కార్మికులు తాగే చీఫ్ లిక్కర్ మీద రూ.20 రూపాయలు అదనంగా వసూలు చేయడం పట్ల మద్యం బాబులు మండి పడుతున్నారు.

### బ్లాక్ మార్కెటింగ్ కు తరలిస్తున్న చీప్ లిక్కర్...

మద్యం దుకాణల్లో చీఫ్ లిక్కర్ లభించడం లేదని బ్లాక్ మార్కెటింగ్ కు, బెల్ట్ షాపులకు సిండికేట్ తరలిస్తుందని అక్కడ వీటిని రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారని, ఇందులో సగం మొత్తాన్ని సంబంధిత మద్యం దుకాణానికి చెల్లిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.20 రూపాయల అక్రమ వసూళ్ళ పై దుకాణ దారులకు, మందుబాబులకు నిత్యం ఘర్షణలు జరుగుతున్నాయి. మూడు నెలల క్రితం నష్టాల్లో ఉంటున్నామని అదనంగా పది రూపాయలు వసూలు చేసుకోవడానికి అధికారికంగా మద్యం సిండికేట్ దారుల నుండి వచ్చిన విజ్ఞప్తి మేరకు కూటమి ప్రభుత్వమే ఎం ఆర్ పి ధర పై రూ.10 లు వసూలు కు జీవో విడుదల చేయడం సంగతి తెలిసిందే. ఒకటి, రెండు నెలల పాటు సజావుగానే సాగినప్పటికీ మద్యం సిండికేట్ దారులు కుమ్మక్కయి మద్యం బాబుల బలహీన తను ఆసరాగా అధికారికంగా రూ.10 రూపాయలతో పాటు, అదనంగా మరో పది రూపాయలు వసూలు చేస్తున్న ప్పటికీ నిస్సహాయంగా చెల్లిస్తూన్నట్లు తెలుస్తోంది. నగరంలోని 90 శాతం మద్యం షాపులు తెలుగు తమ్ముళ్లవే నని, అధికారంలో ఆ పార్టీ ముఖ్య భూమిక గా కూటమి ప్రభుత్వం నడుస్తుండడంతో జనసేన , బిజెపి నేతలు సైతం తెలుగు తమ్ముళ్ల మద్యం దోపిడీని నిలువరించ లేకపోతున్నారని వాదనలు వినిపిస్తున్నాయి. మద్యం సిండికేట్ అదనపు దోపిడీ బహిరంగంగా తెలిసినప్పటికీ నిరోధించడంలో ఎక్సైజ్ శాఖ అధికారుల ఉదాశీనత వెనుక ప్రజా ప్రతినిధుల, అధికార పార్టీ నాయకుల ఒత్తిడి, మరోవైపు ముడుపులు ముట్ట చెప్పడం వెరసి మద్యం సిండికేట్ దోపిడీని పట్టించు కోవడంలేదని ప్రజా సంఘాలు, రాజకీయ పక్షాలు విమర్శి స్తున్నాయి. లక్షల పోసి షాపులు దక్కించుకున్నామని, ఆశించిన విధంగా మార్జిన్లు, లాభాలు రావడం లేదని, ఈ పరిస్థితుల్లో అదనంగా వసూలు చేసుకుంటున్నామని అయినప్పటికీ నష్టాలు తగ్గడం లేదని మద్యం షాపుల యజమానులు బాహాటంగానే సమాధానం చెప్పడం విస్మయనికి గురిచేస్తుంది.

### అపరిశుభ్రత, దుర్వాసనలతో పర్మిట్ రూములు...

మరో పక్క ప్రభుత్వం నిబంధనల ప్రకారం మంచినీరు, టాయిలెట్లు, కుర్చీలు, బెంచీలు వంటి మౌలిక సదుపాయాలతో పర్మిట్ రూము ప్రతి షాపుకు అనుబంధంగా ఉండాల్సి ఉండగా సగానికి పైగా మద్యం షాపుల్లో పర్మిట్ రూములు లేక మద్యం బాబులు రోడ్లమీద, వీధుల్లోనూ, గోదావరి గట్టు వెంబడి, బహిరంగంగా మద్యం సేవించడం నిత్యకృతంగా మారింది. ఉన్నా అరకొర పర్మిట్ రూముల్లోనూ దుర్వాసన, అపరిశుభ్రత, నాణ్యత లేని ఆహార పదార్థాలు, వాటర్ బాటిళ్ళు, విక్రయాలు మందు బాబుల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. బహిరంగ మధ్య సేవనం శాంతి భద్రతల సమస్యలకు దారి తీస్తున్నాయి. వందల రూపాయలు పెట్టి మద్యం కొనుగోలు చేసిన మద్యం బాబులకు కూర్చొని తాగేందుకు చోటు లేదని, ప్రశ్నించిన వారిపై మద్యం దుకాణదారులు, రౌడీ మూకలతో దాడులకు దిగుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని తెలుస్తోంది. ఏవి అప్పారావు రోడ్డు శివారు, గోదావరి గట్టు ఎన్టీఆర్ బొమ్మ వద్ద , తాడితోట, దానవాయి పేట, ఏవి ఏ రోడ్డు చీర్స్, శ్యామల సెంటర్, జాంపేట, మద్యం షాపుల్లో పర్మిట్ రూములు లేవు.

### బార్లుగా మారిన కళ్యాణ మండపాలు...

నిన్న మొన్నటి వరకు గుడి, బడి తేడా లేకుండా జన వాసాల మధ్య మద్యం దుకాణాలు తెరిసిన మద్యం సిండికేట్ దారులు కూటమి ప్రభుత్వ పెద్దల అండతో పిల్లలు ,మహిళ జనంతో శుభకార్యాలతో రద్దీగా ఉండే కళ్యాణ మండపాల్లో మద్యం దుకాణాలు, బార్లను ఏర్పాటు చేయడం జోరుగా పెరిగింది. పద్మావతి కళ్యాణమండపం, గేదెల వారి కళ్యాణ మండపం, గంట గనిరాజు కళ్యాణమండపం, శ్రీనివాస కళ్యాణం మండలం మల్లయ్య పేట తదితర ఏరియాల్లో బార్లు ఏర్పాటయ్యాయి. భవిష్యత్తులో మహిళలు, బాలికల భద్రతకు ప్రమాదాలు ముంచుకోస్తయే మోనని స్థానిక మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై మహిళలు, స్థానికులు ఆందోళనలు చేసిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం పట్ల మహిళల భద్రత ప్రభుత్వ బాధ్యత అన్న నినాదం ఎన్నికల వరకేనా అని పలు ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. నగరంలో ఇప్పటికే నాలుగయిదు బార్లు కళ్యాణ మండపాల్లో కొనసాగు తున్నాయి. చాలా బార్ల లో నాణ్యతలేని, కల్తీ మంచినీళ్లు, ఆహారం నిర్వాహకులు సరఫరా చేయడంతో మందుబాబులు అనారోగ్యం బారినపడి ఆస్పత్రుల ఫాలవుతున్నారని తెలుస్తుంది. ఇకనైనా ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ ఉన్నత అధికారులు, సేఫ్టీ అధికారులు సంయుక్తంగా నగరంలోని మద్యం షాపులు, బార్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన యజమానులపై చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, లైసెన్స్ లు రద్దు చేయాలని, భారీగా జరిమానాలు విధించాలని, నాణ్యతలేని ఆహార పదార్థాలు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని మందుబాబులు, రాజకీయ పక్షాల నాయకులు, ప్రజాసంఘాలు కోరుతున్నాయి




# 60 లక్షల విలువైన 120 కేజీల గంజాయి స్వాధీనం

**గంగవరం, పెన్ పవర్, ఏప్రిల్ 16:**గంజాయి అక్రమ రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని అడ్డతీగల సర్కిల్ ఇన్స్పెక్టర్ బి నరసింహమూర్తి గంగవరం ఎస్సై వెంకయ్య హెచ్చరించారు. గురువారం మధ్యాహ్నం గంగవరం మీదుగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గంగవరం ఎస్ఐ వెంకయ్య తన సిబ్బందితో కలిసి గంగవరం గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో రెండు వాహనాలు రావడంతో పోలీస్ సిబ్బంది ని చూసి వాహనంలోని ఐదుగురు పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని అనంతరం వాహనాలను పరిశీలించగా ఐదు బస్తాలు తో గంజాయి ఉండడం గమనించడం జరిగిందన్నారు. మధ్యవర్తుల సమక్షంలో పంచనామా నిర్వహించగా ఐదు బస్తాల్లో 120 కేజీలు గంజాయి ఉండడం జరిగిందన్నారు. ఆ వాహనాల్లో ఉన్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా వారిలో నలుగురు మహారాష్ట్రకు చెందిన వ్యక్తులుగాను ఒకరు రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించడం జరిగిందన్నారు. వీరి వద్దనుండి 5 సెల్ఫోన్లను కూడా స్వాధీనం చేసుకోవడం జరిగిందని వారు వివరించారు. గంజాయి అక్రమ రవాణా పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందని నిందితులను కోర్టులో హాజరు పరుస్తున్నట్లు వారు తెలిపారు.



# చీడిపాలెం లో ఎన్టీఆర్ ట్రస్ట్ ఉచిత వైద్య శిబిరం






**గంగవరం, పెన్ పవర్, ఏప్రిల్ 16:** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం గంగవరం మండలం జడేరు పంచాయితీ పరిధిలోని చీడిపాలెం గ్రామంలో గురువారం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ నారా భువనేశ్వరి ఆదేశాల మేరకు ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.లోపలి గ్రామాల ప్రజలు బయటకు వెళ్లి వైద్యం పొందలేని పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్రామాలకే వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణలో ఎన్టీఆర్ ట్రస్ట్ ప్రతినిధులు శ్రీకాంత్, కందుల సాయి, కుంజం రామకృష్ణ దొర కీలక పాత్ర పోషిస్తున్నారు.ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

10 గ్రామాల్లో వైద్య శిబిరాలు

గంగవరం మండలంలో ఈ నెలలో మొత్తం 10 గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏప్రిల్ 18న దొర మామిడి, 20న ఈ రామవరం, 21న ఎండపల్లి, 23న మర్రిపాలెం, 25న లక్కొండ, 27న కొత్తాడ, 28న నెల్లిపూడి, 29న సూరంపాలెం, 30న జగ్గంపాలెం గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు.ఎక్స్ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాలు జరుగుతున్నాయి. చీడిపాలెం గ్రామంలో జరిగిన శిబిరంలో డాక్టర్ తీగల ప్రభ, గ్రామ పెద్దలు మడకం వెంకటరమణ, మడకం శివ, డాక్టర్ షనయా, జి.ఏఎన్ఎం చిట్టి, ఫార్మసిస్ట్ స్వర్ణ, ఎన్టీఆర్ ట్రస్ట్ సిబ్బంది నాని, వీఓఏ ఎం.లక్ష్మి, ఆశ వర్కర్ డి. నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం మరియు ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందం



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్.** డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం మరియు ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందం ఎమ్ ఒ యూ పరిపాలనాభవనం లో జరిగింది .

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన నేపథ్యంలో, హైదరాబాద్ రాజేంద్రనగర్ నుండి గుంటూరు జిల్లా లామ్ గ్రామానికి, ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం తరలించబడిన తరువాత, డా వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంతో కుదుర్చుకున్న మొదటి ఒప్పందం. డా. వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. కె. ధనుంజయరావు చొరవతో, రెండు విశ్వవిద్యాలయాల ఉన్నతాధికారులు చర్చించి, అవసరమైన అంశాలు ఒప్పందంలో చేర్చడమైనది.

ఈ రెండు విశ్వవిద్యాలయాలు భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి పరిధిలోకి వస్తాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా, మన రాష్ట్రంలో రైతులకు వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించిన నిపుణుల సలహాలు, సాంకేతిక పరిజ్ఞానం సమన్వయంతో, త్వరితగతిన అందించటానికి మరియు గ్రామ స్థాయిలో ఉన్న రైతు సేవా కేంద్రాలను బలోపేతం చేయడానికి ఈ ఒప్పందం దోహదం చేస్తుంది " అని ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. కట్టుపల్లి ధనుంజయరావు తెలియజేశారు. అంతేకాక

ఈ ఒప్పందం ద్వారా రెండు విశ్వవిద్యాలయాల పోస్ట్ గ్రాడ్యుయేషన్ ( పీజీ) విద్యార్థులు మరియు పీ. హెచ్.డీ పరిశోధకులు తమ పరిశోధనల కోసం ఆయా విశ్వవిద్యాలయాల సదుపాయాలు మరియు ప్రయోగశాలలను ఉపయోగించుకోవచ్చు, సంబధిత శాస్త్రవేత్తల నుండి అవసరమైన మార్గదర్శకత్వం పొందవచ్చు.

ఈ ఒప్పందం ద్వారా పేటెంట్ హక్కులు సద్వినియోగం చేసుకుంటూ, ఆయా విశ్వవిద్యాలయల బోధనా సిబ్బంది మరియు శాస్త్రవేత్తలు విద్యాసంబంధ కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించుకోవచ్చు.

ఈ రెండు విశ్వవిద్యాలయాలు రాబోయే సంవత్సరాల్లో ఉద్యాన, వ్యవసాయ రంగానికి సంబంధించి సంయుక్త నిర్వహణలో విస్తరణ కార్యక్రమాలు, సెమినార్లు , సమాచార మార్పిడి, ప్రణాళిక వర్క్‌షాప్‌లు, నిర్వహించడం, పరిశోధనా పత్రాలు ప్రచురించడం, సర్టిఫికెట్ ప్రోగ్రామ్ నిర్వహించడం వంటివి ఈ ఒప్పందంలో ముఖ్యాంశాలుగా ఉన్నాయని ఉపకులపతి డా.కె. ధనుంజయరావు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఉద్యాన విశ్వవిద్యాలయం తరుపున ఉపకులపతి డా.కె. ధనుంజయరావు, రిజిస్ట్రార్ డా. ఎమ్. మాధవి, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డా. సీఎచ్ రూత్ పాల్గొన్నారు.

ఆచార్య ఎమ్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం తరుపున వైస్ ఛాన్సలర్ డా. ఆర్. శారదా జయలక్ష్మి దేవి, రిజిస్ట్రార్ డా. ఎమ్వి. రమణ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలు పై అవగాహన కార్యక్రమలు





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 16:**ఫైర్ సర్వీస్ వీక్ లో భాగంగా 3వ రోజు తాడేపల్లిగూడెం అగ్ని మాపక కేంద్రాధికారి కె వి మురళీ కొండ బాబు ఆద్వర్యశీలో తాడేపల్లిగూడెం పట్టణం మరియు చుట్టుప్రక్కల గ్రామాలలో ఉన్నటువంటి రెసిడెన్షియల్ అపార్ట్మెంట్ల వద్దకు వెళ్లి అక్కడ నివాసితులకు ఎల్పిజి గ్యాస్ సేఫ్టీ పై, ఎలక్ట్రికల్ సేఫ్టీ పై, అజాగ్రత్తగా పొగత్రాగుటపై మరియు ఫైర్ హజార్డ్ మొదలగు వాటి వల్ల సంభవించే అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి, అగ్ని ప్రమాదాల నిహరణ మరియు అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై వారికి అవగాహన కార్యక్రమములు చేపట్టి, ఫైర్ సేఫ్టీ పోస్టర్లను రెసిడెన్షియల్ అపార్ట్మెంట్ల ప్రాంగణము నందు అతికించడమైనది. మరియు అపార్ట్మెంట్లలో నివసించే ప్రజలకు అగ్నిమాపక వారోత్సవాల కర పత్రములను పంచి అగ్నిప్రమాదాల నివారణ చర్యలు గురించి వివరించారు. అగ్ని మాపక సిబ్బంది పాల్గొన్నారు.

## చేపల మార్కెట్ ను పరిశీలించిన కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 16:**చేపల మార్కెట్ లో కొనుగోలుదారులు, అమ్మకపుదారులకు ఇబ్బందులు కలగకుండా తగు సౌకర్యాలు కల్పించాలని అధికారులను కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. 32వ వార్డు జాంపేట ఫిష్ మార్కెట్ ను రెవిన్యూ, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి గురువారం ఉదయం ఆయన పరిశీలించారు . ఈ సందర్భంగా విక్రయదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శ్లాబ్, ఫ్లోర్ సహా మరమ్మతులకు సంబంధించి వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించేందుకు ఎల్లవేళలా సిద్ధమని తెలియజేశారు. ఫిష్ మార్కెట్ లో వ్యర్థాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని విక్రయదారులకు సూచించారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఎస్ఈ రీటా, రెవిన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, ఎంహెచ్ఓ వినూత్న, డీఈ సత్యనారాయణ, ఇతర సిబ్బంది ఉన్నారు.

## సూర్య కాలేజి విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే




**పెన్ పవర్ ఉంగుటూరు ఏప్రిల్ 16:**ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఉంగుటూరు మండలం గొల్లగూడెంకు చెందిన సూర్య ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్ విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యార్థులను ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అభినందించి సన్మానించారు. విద్యార్థులు మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ వేములపల్లి దుర్గా చైతన్య కుమార్, తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు వేములపల్లి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే నేషనల్ ఫెలోషిప్ అవార్డు అందుకున్న డా జొన్నకూటి



**తాళ్లపూడి, పెన్ పవర్, ఏప్రిల్ 16:**మండలంలోని పైడిమెట్ట గ్రామానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త, కవి, రచయిత, జర్నలిస్ట్, ఉపాధ్యాయుడు డా జొన్నకూటి ప్రమోద్ కుమార్ ప్రతిస్టాత్మకమైన మహాత్మా జ్యోతిరావు పూలే నేషనల్ ఫెలోషిప్ అవార్డు అందుకున్నారు. పాన్ ఇండియన్ సోసియో కల్చరల్ అసోసియేషన్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా అద్దంకి రాజా యోనా ఆధ్వర్యంలో కాకినాడ జె ఎన్ టి యు వి సి, సి ఎస్ ఆర్కే ప్రసాద్ చేతుల మీదుగా ప్రమోద్ ఈ పురస్కారం అందుకున్నారు. తాళ్లపూడి ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అప్పన రాజా, మాజీ ఎం పి పి కొప్పాక కోట్నీస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ వి ఆనంద్ స్వరూప్, గోపాలపురం మండల మానవతా అధ్యక్షులు రాపాక ఫణి కిషోర్ తదితరులు శు భాకాంక్షలు అందచేశారు.


## శ్రీ కరిబండి విద్యా సంస్థలో జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



**తాళ్లపూడి, పెన్ పవర్, ఏప్రిల్ 16:** స్థానిక ఎస్.కె.జి.ఆర్ అండ్ ఎస్.ఎస్.కె జూనియర్ కళాశాల విద్యార్థులు పరీక్షా ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 82 శాతం, ప్రథమ సంవత్సరలో 79 శాతంతో కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి సత్తా చాటి నట్టు డైరెక్టర్ కరిబండి త్రినాథ స్వామి, ప్రిన్సిపాల్ పి.మురళి తెలిపారు. ?ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో పి.వెంకటేశ్వరి అనే విద్యార్థిని 1000 మార్కులకు గాను 981 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. ?ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎ.దేవ హర్షిణి అనే విద్యార్థిని 470 మార్కులకు గాను 464 మార్కులు సాధించి తన ప్రతిభను చాటుకుంది. ?విద్యార్థుల అద్భుత విజయాల పట్ల కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేస్తూ, వారిని అభినందించారు. విద్యార్థుల కష్టానికి, ఉపాధ్యాయుల కృషి తోడవ్వడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని వారు పేర్కొన్నారు.

## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో వివిధ పదవులు పొందిన నాయకులను ఘన సత్కారం






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 16.**పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో వివిధ పదవులు పొందిన నాయకులను ఘన సత్కారం నిర్వహించారు. పట్టణ, మండల, పెంటపాడు ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లు, సెక్రటరీ లను తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ ఇంచార్జ్ వడ్డీ రఘురామ్ నాయుడు ఘనంగా సత్కరించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నాయకులకు పార్టీలో జిల్లా, మండల స్థాయి పదవులు వచ్చాయి. ఈ మేరకు వైసీపీ కేంద్ర పార్టీ కార్యాలయం బుధవారం జాబితాను విడుదల చేసింది. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో ఈ జాబితాను ప్రకటించారు. జిల్లా ఆర్గనైజేషనల్ కార్యదర్శులుగా వింజమూరి శ్రీనివాసు, మద్దుకూరి మెహర్ ప్రసాద్, యాక్టివిటీ జిల్లా కార్యదర్శిగా కందుబోయిన కృపావరంలు ఎంపికయ్యారు. తాడేపల్లిగూడెం పట్టణ కమిటీ అధ్యక్షుడిగా గొర్రెల శ్రీనివాసు, తాడేపల్లిగూడెం మండల పార్టీ అధ్యక్షుడిగా చిట్టూరి భాస్కరరావు(బాపన్న), పెంటపాడు మండల పార్టీ అధ్యక్షుడిగా కైగాల శ్రీనివాసులను నియమించారు. తాడేపల్లిగూడెం మండల పార్టీ ఉపాధ్యక్షుడిగా దారపురెడ్డి శ్రీనివాసు, పెంటపాడు మండల ప్రధాన కార్యదర్శిగా దొడ్డిగర్ల చంద్రయ్య, గూడెం మండల కార్యదర్శిగా గోపిశెట్టి వెంకన్నదొర, పెంటపాడు మండల కార్యదర్శిగా పిల్లి నాగరాజులను నియమించారు. పార్టీ అధినేత జగన్మోహన్రెడ్డికి, తాడేపల్లిగూడెం నియోజకవర్గ కన్వీనర్ వడ్డి రఘురామ్ కు పదవులు పొందిన నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేస్తామని, మళ్ళీ నియోజకవర్గంలో వైసీపీ జెండా ఎగురవేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# రైతు సమస్యలను వెంటనే పరిష్కరించండి :ఎమ్మెల్యే బొలిశెట్టి.

పెంటపాడు మండల అభివృద్ధిసమీక్ష సమావేశం.






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 16:** రైతుల సమస్యలను ఎటువంటి ఆలస్యం లేకుండా పరిష్కరించాలని స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అధికారులను కోరారు. స్థానిక ఎమ్మెల్యే విడిది కార్యాలయంలో గురువారం పెంటపాడు మండల అభివృద్ధి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్షించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీలో ఎదురవుతున్న సమస్యలను వేగంగా పరిష్కరించాలని కోరారు. సాగునీరు, తాగునీరు సరఫరా విషయంలో శ్రద్ధ వహించాలని సూచించారు. సందర్భంగా నీటి ఎద్దడి రాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. మండలంలో వివిధ ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు సకాలంలో అందే విధంగా కృషి చేయాలన్నారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రజారోగ్యసంరక్షణలో అలసత్వం వహించవద్దని అన్నారు.పారిశుధ్య నిర్వహణ సమగ్రంగా ఉండాలని అన్నారు. ప్రతి గ్రామంలోనూ పరిసరాల పరిశుభ్రతపాటించి, ఆరోగ్యకర వాతావరణం ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలుష్య రహిత గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాయని అన్నారు.స్వచ్ఛ సర్వేక్షన్, జలజీవన్ మిషన్ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో పెంటపాడు తహసిల్దార్ సునీల్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 16:** గత ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సకాలంలో వేతనాలు చెల్లించక, జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ వంటి అవసరాలకు దాచుకున్న సొమ్ములు కూడా ప్రభుత్వం వాడుకుని, దేశంలో ఏరాష్ట్రంలో జరగని విధంగా తాత్కాలిక భ్రుతికంటే ఫిట్మెంట్ నాలుగు శాతం తగ్గించి మనోవేదనకు గురి చేశారని
ధవలేశ్వరం పెన్షనర్స్ అసోసియేషన్ యూనిట్ అధ్యక్షులు ఆన్నారు . ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన పిదప రమారమి పదహారు వేల కోట్ల రూపాయల బకాయిలు చెల్లించినందుకు ఏపీ ఎస్ జి ఆర్ ఈ ఏ పెన్షనర్స్ అసోసియేషన్ యర్రమోతు ధర్మరాజు ధన్యవాదాలు తెలియజేసారు. 2023 వ సంవత్సరం నుండి వేతన సవరణ కమిటీ నియమించక పోవడం, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కరువు భత్యం ప్రకటించకపోవడంతో పొందే వేతనానికి అయ్యే ఖర్చులకు పొంతన లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటు న్నామన్నారు . వెంటనే వేతన సవరణ కమిటీ నియమించి తాత్కాలకు బృతిని ప్రకటించవలసిందిగా ధవలేశ్వరం పెన్షనర్స్ అసోసియేషన్ యూనిట్ అధ్యక్షులు యర్రమోతు ధర్మరాజు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందజేశారన్నారు . కేంద్ర ప్రభుత్వం వాల్యుడేషన్ యాక్ట్ అమలు చేయుటకు సిద్ధపడుతుందని, పండుటాకులపై తీవ్ర ప్రభావం చూపనుందన్నారు. ఇరవై ఏళ్ల క్రితం అప్పటి కేంద్ర ప్రభుత్వం సిపిఎస్ అమలు చేయగా కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్రాలు అమలుచే యలేదన్నారు . ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సిపిఎస్ ఉద్యోగులకు గ్రాడ్యుటి చెల్లించే విధంగా మీరు నిర్ణయించడం ఆ ఉద్యోగులకు వరంగా లభించిందన్నారు . ఈ వాలిడేషన్ యాక్ట్ అమలును నిలుపుదలకు సూచించవలసిందిగా తప్పనిసరి పరిస్థితుల్లో అమలు చేయుటకు కేంద్ర ప్రభుత్వం సిద్ధపడితే రాష్ట్ర ఫెన్షనర్లకు ప్రభావం చూపకుండా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ధర్మరాజు వినతిపత్రంలో కోరారు.
ప్రజా సమస్యలు పరిష్కారం వేదికలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ శాఖ మాత్యులు గొట్టిపాటి రవికుమార్ కి వినతిపత్రం అందించినట్లు ధర్మరాజు తెలిపారు.


# ఏపీ నిట్ ఆచార్యులకు నూతన ప్రాజెక్టులు మంజూరు





ఆచార్యులను అభినందించిన నిట్ అధికారులు

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 16:**నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్) కి చెందిన ఇద్దరు ఆచార్యులకు నూతన ప్రాజెక్టులు మంజూరయ్యాయి. వాటి వివరాలీలా ఉన్నాయి. సంస్థలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఆచార్యులు డాక్టర్ షాగోల్సెమ్ రోమియో మైటీ
భవిష్యత్తు తరాల స్మార్ట్ పరికరాల కోసం స్వయంగా పనిచేసి యువీ కాంతిని గుర్తించే పరికరాల అభివృద్ధి అనే ప్రాజెక్టుకు రూ 70 లక్షల నిధులను దక్కించుకున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా భవిష్యత్తులో ఆల్ట్రావైడ్ బ్యాండ్గాప్ పదార్థాలు, లోపాల వల్ల ఏర్పడే విద్యుత్ ప్రవాహం మరియు పి -ఎన్ హెటరోజంక్షన్‌లో ఛార్జ్ రవాణా విధానాలపై పరిశోధించి, బయట పవర్ సప్లై అవసరం లేకుండా పనిచేసే అత్యంత సమర్థవంతమైన సెల్ఫ్ పవర్డ్ యువీ ఫోటోడిటెక్టర్ ను అభివృద్ధి చేయనున్నారు. ఈ పరికరాలు సూర్యకాంతి ప్రభావం లేకుండా యువీని గుర్తించటంతోపాటు అధిక ఉష్ణోగ్రతల వద్ద కూడా పనిచేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. అందువల్ల ఇవి పర్యావరణ మానిటరింగ్, అంతరిక్ష మిషన్లు, క్షిపణి ట్రాకింగ్, అగ్ని గుర్తింపు, పరిశ్రమల భద్రత వంటి రంగాల్లో ఉపయోగపడతాయి. భవిష్యత్తు తరాలు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్
ఆధారిత స్మార్ట్ సిస్టమ్స్‌లో కూడా వీటిని వినియోగించుకోవచ్చు.ఈ పరికరాలను దూర ప్రాంతాల్లోగాని, విద్యుత్ వనరులు అందుబాటులో లేని ప్రాంతాల్లో కూడా ఉపయోగించుకోవచ్చు. ఎందుకంటే వీటికి బ్యాటరీ మార్పిడి, నిర్వహణ అవసరం తక్కువగా ఉంటుంది. మొత్తంగా, ఈ ప్రాజెక్ట్ స్థిరమైన ఎలక్ట్రానిక్స్, తక్కువ శక్తి వినియోగ సెన్సింగ్ టెక్నాలజీలు, భవిష్యత్తు అంతరిక్ష, రక్షణ, పర్యావరణ రంగాల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుంది.
ఈయనతోపాటు బయో టెక్నాలజీ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఆచార్యురాలు డాక్టర్ నిషా అమర్నాథ్ జొన్నియా నిపా వైరస్ జి మరియు ఎఫ్ గ్లైకోప్రోటీన్లపై నిర్మాణ ఆధారిత యాంటీబాడీ రూపకల్పనతో పాటు ఎంఎల్సీకె ద్వారా జరిగే ఎండోథీలియల్ ప్రభావాలపై ద్వంద్వ చికిత్సా విధానం, మల్టిస్కేల్ ఎం.డి, ప్రోటీన్ నెట్‌వర్క్ విశ్లేషణ అనే ప్రాజెక్టుకు రూ 48 లక్షల నిధులను దక్కించుకున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా నిపా వైరస్ పై నిర్మాణ ఆధారిత యాంటీబాడీ ఇంజినీరింగ్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో ముఖ్యంగా వైరస్ ఉపరితల ప్రోటీన్లు అయిన గ్లైకోప్రోటీన్, ఫ్యూషన్ ప్రోటీన్లను లక్ష్యంగా తీసుకొని, వైరస్ హోస్ట్ సెల్‌లోకి ప్రవేశించే విధానాన్ని అడ్డుకునే సమర్థవంతమైన యాంటీబాడీలను రూపకల్పన చేస్తారు. కంప్యూటేషనల్ బయాలజీ పద్ధతులను ఉపయోగించి, గ్లైకోప్రోటీన్, హోస్ట్ సెల్‌లోని ఎఫ్రిన్ రిసెప్టర్ల మధ్య జరిగే పరస్పర చర్యను విశ్లేషించి, ఆ పరస్పర చర్యను భంగం చేసే చిన్న అణు నిరోధకాలను గుర్తిస్తారు. అదనంగా, మెరుగైన బైండింగ్ సామర్థ్యం, స్థిరత్వం కలిగిన యాంటీబాడీ నిర్మాణాలను ఆప్టిమైజ్ చేసి వైరల్ న్యూట్రలైజేషన్‌ను బలపరుస్తారు. ఈ ప్రాజెక్ట్‌లో హోస్ట్ ఆధారిత చికిత్సా విధానాన్ని కూడా సమాంతరంగా పరిశీలించడం జరుగుతుంది. ఇందులో మయోసిన్ లైట్ చైన్ కినసే
పాత్రను విశ్లేషించి, ఎన్.ఐ.వి సంక్రమణ సమయంలో ఎండోథీలియల్ కణాలలో ఏర్పడే లోపాలు, రక్తనాళాల లీకేజ్, వాస్క్యులర్ డిస్ఫంక్షన్ వంటి ప్రభావాలను అర్థం చేసుకుంటారు. ఎం.ఎల్.సి.కె నియంత్రణ ద్వారా హానికర ప్రభావాలను తగ్గించే అవకాశాలను పరిశీలించి, సిలికో మల్టీ-ఎపిటోప్ వ్యాక్సిన్ డిజైన్ ద్వారా వేగంగా వ్యాక్సిన్ ను అభివృద్ధి చేయనున్నారు. ఈ సమగ్ర కంప్యూటేషనల్ విధానం ద్వారా వైరస్‌పై నేరుగా దాడి చేసే చికిత్సా మార్గాలు, హోస్ట్ రక్షణను బలోపేతం చేసే వ్యూహాలను కలిపిన ద్వంద్వ చికిత్సా విధానాన్ని అభివృద్ధి చేయటమే ఈ పరిశోధన యొక్క ప్రధాన లక్ష్యం. వీరికి ఈ నిధులను భారత ప్రభుత్వ ఆధీనంలోని అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్)- ఎర్లీ కెరీర్ రీసెర్చ్ గ్రాంట్ (ఈ.సి.ఆర్.జి) నుంచి కేటాయించింది. వీరు మూడేళ్ళ కాలపరిమితిలో ఈ ప్రాజెక్ట్ లను పూర్తిచేయాల్సి ఉంటుంది. జాతీయస్థాయి ప్రాజెక్టులను దక్కించుకున్న ఆచార్యులిద్దరిని ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్.వి.రమణారావు, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్లు డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ వీరేష్ కుమార్, డాక్టర్ హిమబిందు, పలువురు విభాగాధిపతులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవి కిరణ్ శాస్త్రి మాట్లాడుతూ
తమ విద్యా సంస్థకు చెందిన ఆచార్యులు ప్రతిష్టాత్మక జాతీయస్థాయి ప్రాజెక్టులను దక్కించుకోవటం తమకెంతో గర్వకారణంగా ఉందని వివరించారు.






# ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఎన్ ఆర్ ఐ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ ఏప్రిల్ 16**:ప్రభుత్వం వెల్లడించిన ఇంటర్ పబ్లిక్ పరీక్షల 2026 ఫలితాల్లో రాజమండ్రిలోని ఎన్ ఆర్ ఐ జూనియర్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు అధ్యాపకులు, తల్లిదండ్రులతో విజేతల విజయోత్సవ అభినందన సభ గురువారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సీఈవో వి .తులసి రామ్ మీడియాతో మాట్లాడుతూ ఎంపీసీ గ్రూపులో 466 మార్కులతో ఎన్ రిషిక, 465 మార్కులతో మరో నలుగురు, 460 మార్కులతో 42 మంది విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు. బైపిసి గ్రూపులో 450 మార్కులతో ముగ్గురు, 445 మార్కులతో 29 మంది ప్రతిభ సాధించారన్నారు. జూనియర్ ఇంటర్ లో 99.52 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ ఫలితాలు సాధించడానికి విద్యార్థుల కృషి, అధ్యాపకుల, తల్లిదండ్రుల సహకారం కారణమని కృతజ్ఞతలు తెలిపారు. ఇతర విద్యాసంస్థల మాదిరిగా ఎక్కడో సాధించిన ఫలితాలను ఇక్కడే సాధించినట్లుగా గొప్పలు చెప్పుకునే తల్లిదండ్రులను తప్పు దోవ పట్టించే విధానం తమది కాదన్నారు. ఈ సమావేశంలో కళాశాల చైర్మన్ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ,ప్రిన్సిపాల్ మురళీకృష్ణ , ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, ఏవో వీరభద్రం ఉమా తదితరులు పాల్గొన్నారు.

# డెకాయిట్ చిత్రం విజయం సాధించడం సంతోషంగా ఉంది : హీరో అడవి శేషు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 16** తానే రచించి, నటించిన డెకాయిట్ (ఓ ప్రేమ కథా) చిత్రం విజయవంతం కావడం తనకు సంతోషంగా ఉందని ఆ చిత్రం హీరో శేషు అన్నారు. ఇంతవరకు తన కెరీర్లో క్రైమ్ , ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ వంటి సీరియస్ పాత్రలో పోషించానని, ఇకనుంచి ప్రేమ కథ చిత్రాల్లో నటించాలని అనుకుంటున్నానని తెలిపారు. తన తదుపరి చిత్రం గూడచారి 2 వచ్చే సంవత్సరం రిలీజ్ కానున్నదని తెలిపారు. నగరంలో రెండు థియేటర్లో ఈ చిత్రాన్ని ప్రేక్షకులతో కలిసి చూస్తానన్నారు. ఈ చిత్రాన్ని తన మిత్రుడు, డైరెక్టర్ సానియాల్ డియో హిందీ ,తెలుగు వెర్షన్ లో స్ట్రెయిట్ గా నిర్మించామని దాంతో సహజంగా వచ్చిందన్నారు. డైరెక్టర్, హీరోయిన్ మృణాల్ ఠాకూర్ లు బెంగళూరు, ఢిల్లీ ఇతర ప్రాంతాల్లో చిత్రం విజయోత్సవాల్లో పాల్గొంటున్నారన్నారు

# అడవుల రక్షణ - జంతువుల విశిష్టత

## మాంటిస్సోరి విద్యార్థుల వినూత్న ప్రదర్శన






**తాళ్లపూడి, పెన్ పవర్, ఏప్రిల్ 16:** పర్యావరణ పరిరక్షణ, అంతరించిపోతున్న వన్యప్రాణులపై అవగాహన కల్పిస్తూ తాళ్లపూడి గ్రామంలోని మాంటిస్సోరి హైస్కూల్ విద్యార్థులు చేపట్టిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. పాఠశాల ప్రాంగణంలో ఎల్కేజీ, యూకేజీ విద్యార్థులు వివిధ అడవి జంతువుల వేషధారణలో అలరించారు. ?చిన్నారులు పులులు, సింహాలు, ఏనుగులు, ఇతర అడవి జంతువుల వేషాలు ధరించి, అడవుల్లో జంతువుల జీవనశైలిని, వాటి ప్రాధాన్యతను కళ్ళకు కట్టినట్లు ప్రదర్శించారు. పర్యావరణ సమతుల్యతలో అడవుల పాత్ర ఎంత కీలకమో చిన్నారులు తమ ప్రదర్శన ద్వారా చాటిచెప్పారు. ?ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల కరెస్పాండెంట్ వి.వి.అనీస్ మాట్లాడుతూ విద్యార్థులు చేపట్టిన ఈ కార్యక్రమం సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని కొనియాడారు.? అంతరించిపోతున్న అడవులను, మూగజీవాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పర్యావరణ మార్పుల వల్ల కలిగే నష్టాలను అరికట్టాలంటే వన్యప్రాణుల విశిష్టతను ప్రజలు గ్రహించాలని, ఇంతటి చక్కని సందేశాత్మక కార్యక్రమాన్ని రూపొందించిన ఉపాధ్యాయులను కరెస్పాండెంట్ అనీష్ ప్రత్యేకంగా అభినందించారు. ?చిన్న వయసులోనే విద్యార్థులకు ప్రకృతి పట్ల మక్కువ కలిగించడం అభినందనీయమని కొనియాడారు. ?తమ పిల్లలు అద్భుతమైన వేషధారణతో సందేశాన్ని ఇవ్వడం చూసి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యం కేవలం చదువుకే పరిమితం కాకుండా, ఇలాంటి సామాజిక అవగాహన కార్యక్రమాలు చేపట్టడం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లో పలువురికి నియమకాలు**




**రాజమహేంద్రవరం, పెన్ పవర్,ఏప్రిల్ 16 :**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ హోదాలలో నియమించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి , రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ గురువారం కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు వార్డులలో అధ్యక్షులను నియమించారు. జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా సేపేని మునీశ్వర రావును, వైఎస్సార్ టీయూసీ సిటీ ప్రెసిడెంట్ గా దాది గౌరీశంకర్ ను నియమించారు. 6వ డివిజన్ అధ్యక్షుడిగా నల్ల రామాంజనేయులు ను, 24వ డివిజన్ అధ్యక్షుడిగా ఎజ్జవరపు శ్రీనివాసరావును, 25వ డివిజన్ అధ్యక్షుడిగా రొక్కం త్రినాధ్ ను, 51 డివిజన్ అధ్యక్షుడిగా గుత్తుల కోటేశ్వరి ని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలే ఉపేతానికి కృషి చేయాలని అన్నారు. వచ్చే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో క్రింది స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి మున్సిపల్ కార్పొరేషన్ లో జెండా ఎగరవేసేలా కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని తెలిపారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికలలో పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగుదామని పిలుపు నిచ్చారు.

# మెడికేటెడ్ దోమతెరలను ఉపయోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోండి



**వై రామవరం, పెన్ పవర్, ఏప్రిల్ 16:** రసాయనాలు పూసిన దోమతెరలను ఉపయోగించడం వలన దోమల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఎంపీడీవో కే బాపన్న దొర పిలుపునిచ్చారు.

చవిటి దిబ్బల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల తోటకూర పాలెం లో గురువారం దోమతెరలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. దోమతెరలు ఎలా ఉపయోగించాలనే దానిపై వినియోగదారులకు అవగాహన కార్యక్రమం కల్పించడం జరిగిందని తెలిపారు. అనంతరం దోమతెరలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆనంద్ రావు, మెడికల్ ఆఫీసర్, మలేరియా సిబ్బంది, ఆశా వర్కర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

# చేబ్రోలు రైల్వే ఫ్లైఓవర్ వంతెన నిర్మాణంతో మా జీవనోపాధి పోగొట్టొద్దు



**పెన్ పవర్ -- ఏలూరు జిల్లా, ఉంగుటూరు । ఏప్రిల్ 16**

ఆర్డీవో, ఎమ్మెల్యే వద్ద మొరపెట్టుకున్న నిర్వాసితులు

విజయవాడ--విశాఖ రైలుమార్గంలో చేబ్రోలు వద్ద నిర్మించతలపెట్టిన రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కారణంగా నారాయణపురం గ్రామంలో వందలాది నివాస గృహాలు తొలగించే పరిస్థితి ఏర్పడిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. భూసేకరణ జరిగితే తమ జీవనోపాధి పోతుందని, కుటుంబాలతో రోడ్డున పడే ప్రమాదం ఉందని మహిళలు కన్నీటిపర్యంతమయ్యారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం భూసేకరణ చేపట్టేందుకు రైల్వే శాఖ ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో రైల్వే అధికారులు చేబ్రోలు, నారాయణపురం గ్రామాల్లో పర్యటించి భూముల వివరాలను నిర్ధారించారు.

ఈ విషయంపై నారాయణపురం నాయుడుపేట నుంచి శ్రీనివాస థియేటర్ వరకు ఉన్న నివాసితులు, వ్యాపారస్తులు తమ అభ్యంతరాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సమావేశం ఏర్పాటు చేసి, ఏలూరు ఇన్‌చార్జ్ ఆర్డీవో ఐ.కిషోర్, రైల్వే శాఖ డీఈ సత్యప్రసాద్లను పిలిపించారు. బాధితులతో అధికారుల మధ్య ముఖాముఖి సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, తాము గత 100 సంవత్సరాలుగా తమ పూర్వీకుల కాలం నుంచే ఇక్కడ నివాసం ఉంటున్నామని, రోజువారీ కూలీ పనులు, చిన్న వ్యాపారాలతో కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. భూసేకరణ జరిగితే తమ జీవనాధారం కోల్పోతామని పేర్కొంటూ, ప్రత్యామ్నాయ మార్గాన్ని పరిశీలించాలని అధికారులను కోరారు.

## జనగణన-2027లో మంత్రి కందుల దుర్గేష్ వివరాలు నమోదు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 16:**నగరంలోని తన నివాసంలో స్వయంగా జనగణన వివరాలను నమోదు చేసుకున్న మంత్రి కందుల దుర్గేష్ నమోదు చేసుకున్నారు.

దేశ ప్రగతికి 'జనగణన' దిక్సూచి అని, జనగణనలో తాను నమోదు చేసుకున్నానని ప్రజలు పాల్గొనలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.

ప్రజాస్వామ్య పరిపాలనలో జనాభా ప్రాతిపదికనే సంక్షేమ పథకాల రూపకల్పన జరుగుతుందని, జనగణనలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్' ప్రారంభం అయిందని అధికారులకు ప్రజలు సహకరించాలని మంత్రి దుర్గేష్ అన్నారు. ఏప్రిల్ 30 వరకు 'సెల్ఫ్ ఎన్యూమరేషన్'కు అవకాశం ఉందని,మే 1 నుండి ఇంటింటికి ఎన్యుమరేటర్లు వచ్చి వివరాలు నమోదు చేసుకుంటారని పేర్కొన్నారు.

## జనాభా నమోదులో ప్రజలు భాగస్వాములు కావాలి



**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపు**

**రాజమహేంద్రవరం , పెన్ పవర్, ఏప్రిల్ 16:**జనాభా నమోదు ప్రక్రియలో భాగంగా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్వయంగా తన వివరాలను నమోదు చేసుకున్నారు. తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొని వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్వహిస్తున్న జనాభా నమోదు కార్యక్రమం దేశ అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపకల్పనకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. “డిజిటల్ యుగానికి అనుగుణంగా ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ స్వీయ జనాభా నమోదు విధానం ప్రజలకు ఎంతో సౌకర్యవంతమైనదన్నారు. ప్రతి కుటుంబం స్వచ్ఛందంగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో జగదీశ్వరి విజయ్ దంపతులు.



**పోలవరం, పెన్ పవర్, ఏప్రిల్ 16.** రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ నిర్వాహకురాలు కొవ్వాసు జగదీశ్వరి టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి విజయ్ నాయక్ దంపతులు గురువారం కలియుగ దైవంగా పిలవబడే తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. వీరు తమ పిల్లపాపలతో కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలు నడుమ రాచ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగదీశ్వరి విజయ్ దంపతులు మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్రం దినదిన అభివృద్ధి చెందాలని కోరుకున్నామన్నారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అనుభవాన్ని జోడించి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి లోకి తీసుకురావాలని స్వామివారిని వేడుకున్నామన్నారు. అలాగే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పార్టీ బాధ్యతలను తన భుజ స్కందాలుపై వేసుకొని పార్టీని బలోపేతం చేయాలని స్వామివారిని ప్రార్థించామన్నారు. కూటమిపాలనలో రాష్ట్రంలోని ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ వారిపై ఉండాలని ఈ దంపతులు అన్నారు.

## భారతరత్న డాక్టర్ బి.ఆర్అంబేద్కర్ అందరివాడు. కుక్కల కీర్తి కుమార్.



**గోపాలపురం, పెన్ పవర్, ఏప్రిల్ 16.**భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందరివాడని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ పూర్వ కార్యదర్శి కుక్కల కీర్తి కుమార్ కొనియాడారు. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మండలంలోని వేళ్ళ చింతల గూడెం గ్రామంలో అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి సంబంధించి అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఒక కీర్తి కుమార్ 40 మంది వృద్ధులు, వితంతువులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మేధావి అయిన అంబేద్కర్ ను యువత ఆదర్శంగా తీసుకొని చదువుల్లో రాణించాలన్నారు. ఆయన బాల్యం నుండి ఎన్నో అష్ట కష్టాలను ఎదుర్కొని దేశ, విదేశాలలో ఉన్నత చదువులు చదివి అపారమైన జ్ఞానాన్ని తన సొంతం చేసుకున్నారన్నారు. అటువంటి వ్యక్తి దేశంలో పుట్టడం భారత దేశానికే గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్య నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


## తెదేపా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నారా లోకేష్ ని నియమించడం పట్ల హర్షం..

**తెదేపా జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి..**




**కోరుకొండ, పెన్ పవర్, ఏప్రిల్ 16:** తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నారా లోకేష్ ని నియమించడం పట్ల తూర్పుగోదావరి జిల్లా తెదేపా అధ్యక్షులు మరియు రుడా చైర్మన్, నియోజకవర్గ ఇన్చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి హర్షం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వంద సంవత్సరాలు పాటు తిరిగి ఉండదని పార్టీ పెట్టినప్పటి నుండి నూతన ఉత్సాహంతో ఊరకలు వేసిందని బీసీలు మహిళలు యువతకు ఎప్పుడు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తనకాల నాగేశ్వరరావు, కంటే కేశవరావు, పుప్పాల వెంకటరత్నం, రాజేష్, అతికింశెట్టి కామరాజు, మద్దాల కృష్ణ,రొంగల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కొమ్మిరెడ్డి పరశురామారావును సత్కరించిన మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు



**తాళ్ళపూడి, పెన్ పవర్, ఏప్రిల్ 16:**మండలంలోని వేగేశ్వరపురం గ్రామ మాజీ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావుకు సన్మాన కార్యక్రమం బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు, కరిబండి కాలేజీ అధినేత కరిబండి గనిరాజు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శీర్ల బ్రహ్మానందం వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా కొమ్మిరెడ్డి పరశురామారావు సుదీర్ఘ రాజకీయ చరిత్రలో మంచి వ్యక్తిగా ముద్ర వేసుకున్నారని అన్నారు. గ్రామంలో ఎవరికి ఎటువంటి సమస్య వచ్చినా తప్పకుండా తీర్చే వారిని, భవిష్యత్తులో కూడా అదేవిధంగా ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు సేవలు అందించిన వార్డు మెంబర్లకు ఘన సన్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు, నాయకులు తదితరులు పరశురామారావుకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, బంధువులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన రాజమహేంద్రి జూనియర్ కళాశాల విద్యార్థినీలు




**రాజమహేంద్రవరం ,పెన్ పవర్, ఏప్రిల్ 16:**ఇంటర్ మీడియట్ ఫలితాల్లో రాజమహేంద్రి జూనియర్ కళాశాల విద్యార్థినీలు ప్రతిభ చాటారని కళాశాల ప్రిన్సిపాల్ఎం కె ఎస్ ప్రసాదు తెలిపారు. ఫలితాలు వెలువడిన సందర్భంగా గురువారం డైరెక్టర్లు సత్య సౌందర్య, స్వరూప్ లతో కలిసి మీడియాతో మాట్లాడారు. నగరంలో పేద, సామాన్య వర్గాలకు అందుబాటు ఫీజులతో తమ కళాశాల 20 సంవత్సరాలుగా నడుస్తుందని తెలిపారు. అధ్యాపకుల అంకితభావం, క్రమశిక్షణ , కష్టపడి చదివే విద్యార్థునీలతో ఉత్తమ ఫలితాలు సాధించామని అన్నారు. మెరిట్, వెనకబడిన విద్యార్థునీలతోనూ ప్రత్యేకంగా విడివిడిగా తరగతులు నిర్వహించి ఫలితాలు సాధిస్తున్నామన్నారు. ఎంపీసీ లో 72 మందిలో 45 మందికి 462 మార్కులు, సి ఈ సి లో 93 మందిలో 50 మందికి 90% మార్కులు, ఎం ఈ సి లో ఎనిమిది మందికి 100% మార్కులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## మహిళా భద్రతపై అవగాహన ర్యాలీ






**చింతూరు, పెన్ పవర్ ఏప్రిల్ 16:** పోలీసుల ఆధ్వర్యంలో మహిళా భద్రతపై అవగాహన కల్పించేందుకు బాలికలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఎస్పీ హేమంత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలలు లేదా కళాశాలల్లో ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అటువంటి ఘటనలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిన అవసరం ఉందని, గృహ హింసకు వ్యతిరేకంగా సమాజం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహిళా భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ ర్యాలీలో మహిళలు, చింతూరు సీఐ గోపాలకృష్ణ, ఎస్సై సంతోష్ కుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు .. ఎస్సై బి. వినయ ప్రతాప్



**సీతానగరం, పెన్ పవర్, ఏప్రిల్ 16:** హెల్మెట్, లైసెన్సు లేకుండా సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తూ వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సీతానగరం ఎస్సై బి.వినయ ప్రతాప్ హెచ్చరించారు. గురువారం మండలంలోని త్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవని మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైనా కఠిన చర్యలు తప్పవన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుపడితే వారి వాహనాలను సీజ్ చేసి లైసెన్సులను రద్దు చేస్తామని తెలిపారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు ఉండేలా చూసుకోవాలని, లేకపోతే అపరాధ రుసుం భారీగా విధిస్తామని తెలిపారు. అనంతరం ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారికి హెల్మెట్లు లేకపోవడంతో తక్షణమే వారితో హెల్మెట్లు కొనుగోలు చేసి, ధరించే విధంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలో ప్రయాణికులను పరిమితి మించి ఎక్కిస్తే చర్యలు తప్పవన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదని చెప్పారు. అదేవిధంగా రహదారులపై ధాన్యం రాశులు పోయే రాదని తెలిపారు. నిబంధనలు పాటించని వారికి నోటీసులు ఇచ్చి కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాటికి తల్లిదండ్రులే బాధ్యులు అవుతారని తెలిపారు.

## దోమతెరల పంపిణీ మలేరియా నివారణపై అవగాహన






**చింతూరు, పెన్ పవర్ ఏప్రిల్ 16:** పేగా పంచాయతీ పరిధిలోని వేదులగూడెం గ్రామంలో దోమతెరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ సర్పంచ్ పాయం చంద్రయ్యా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేగా పంచాయతీలో మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్న గ్రామం వేదులగూడెం కావడంతో మొదటగా ఇక్కడ దోమతెరల పంపిణీ చేపట్టామని తెలిపారు. పంచాయతీ పరిధిలో మొత్తం ఎనిమిది గ్రామాలకు దోమతెరలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ప్రజలు దోమతెరలను సరైన విధంగా ఉపయోగించుకోవడం ద్వారా మలేరియా వంటి వ్యాధులను నివారించుకోవచ్చని సూచించారు. అలాగే దోమతెరల ఉపయోగం, వాటి వల్ల కలిగే లాభాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పేగా పంచాయతీ సొసైటీ చైర్మన్ చిట్టిబాబు, వార్డ్ సభ్యుడు శివయ్య, యువ నాయకుడు రఘు, మలేరియా విభాగం జిల్లా కన్సల్టెంట్ చంటి బాబు, సూపర్వైజర్ సవలం రామయ్య, ఎంఎల్హెచ్పీ పి. రత్నకుమారి, హెల్త్ అసిస్టెంట్లు సరియం సంజీవరావు, కోటేశ్వరావు, ఆశా కార్యకర్తలు లక్ష్మి, సునీత, పొజ్జమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అడ్డతీగల మండలంలో పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ పర్యటన..





**అడ్డతీగల, పెన్ పవర్, ఏప్రిల్ 16 :** పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు. స్మరణ రాజ్ గురువారం అడ్డతీగల మండలంలో పర్యటించారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం డిజిటల్ విధానంలో జనగణన సెన్సెస్ 2026 -27 స్వీయ గణన కార్యక్రమాన్ని ప్రజల్లో విస్తృతం గా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని, జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. ఈ సెన్సస్ కార్యక్రమం పోలవరం జిల్లా కలెక్టర్ కే. దినేష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం అడ్డతీగల జిల్లా పరిషత్ పాఠశాలలో 2026-27 సెన్సెస్ శిక్షణ కార్యక్రమాన్ని పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు. స్మరణ్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా జాయ స్మరణ్ రాజ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఈనెల 16వ తారీకు నుండి ఈనెల 30వ తారీఖు వరకు పోలవరం జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో గ్రామాలలో డిజిటల్ జనగణన-స్వీయ గణన లో భాగంగా కుటుంబంలోని సభ్యుల వివరాలను, రిజిస్ట్రేషన్ చేసుకుని విధంగా పంచాయితీ కార్యాలయాలకు సంబంధించిన సిబ్బంది మీ మీ పరిధిలో గల గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలని సచివాలయాలకు సంబంధించిన సిబ్బందిని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. డిజిటల్ పద్ధతిని పారదర్శకంగా అదేవిధంగా వేగంగా ,నమోదు చేసుకునే విధంగా జిల్లాలోని ప్రజలు మీమీ మొబైల్ లో గాని, కంప్యూటర్ల ద్వారా గాని, అదేవిధంగా ప్రభుత్వ పోర్టర్ లో లాగిన్ అయి మీ మీ వివరాలను స్వయంగా పొందుపరచుకోవాలని ఆయన ప్రజలను కోరారు. అనంతరం 'మీ భూమి మీ హక్కు' రీ సర్వే దుప్పుల పాలెం గ్రామంలో ఏ విధంగా చేయుచున్నది ,ఆయన పరిశీలించారు. ఈ సర్వేలో భూమి హద్దులకు సంబంధించిన ఇరువురి రైతులను దగ్గర ఉంచి హద్దులు వేసుకునే విధంగా ఎటువంటి భూ తగాదాలకు తావు లేకుండా రీ సర్వే పక్కాగా చేయాలని, సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. సర్వే చేయు గ్రామాలలో ముందుగా ఆయా గ్రామాలలో ప్రజలకు తెలియజేయాలని ఆయన అన్నారు. అనంతరం దుప్పుల పాలెం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ముందుగా ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంతమంది వైద్యులు ఉన్నది, ఎంతమంది సిబ్బంది ఉన్నది, ప్రతిరోజు ఎంతమంది పేషెంట్లు వచ్చుచున్నది, ఏ ఏ మందులు అందుబాటులో ఉన్నది ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు. స్మరణ్ రాజ్ మాట్లాడుతూ ఆస్పత్రులకు వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని ఆయన అన్నారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎంతమంది గర్భిణీ స్త్రీలు ఉన్నది, ఎంతమంది బాలింతలు ఉన్నది ఆయన ఆరా తీశారు. వివిధ వ్యాధులకు సంబంధించిన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో పెట్టాలని ఆయన ఆయన ఆదేశించారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. అదేవిధంగా రక్త పరీక్షలు ఏ విధంగా చేయుచున్నది ఆయన ఆరా తీశారు. అదేవిధంగా ఈ ప్రాంత ప్రజలకు జీ.సీ.సీ ద్వారా గ్యాస్ ఏవిధంగా సరఫరా చేయుచున్నది ఆయన పరిశీలించారు . జాయింట్ కలెక్టర్ వెంట అడ్డతీగల తాసిల్దార్ దొరకయ్య, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ మిరియాల. లక్ష్మణ్, సర్వేర్లు, వీఆర్వోలు, వైద్యాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పోరాడి కొట్టుకుంటే సమస్య పరిష్కారం కాదు...





- **మీకు న్యాయం చేయడానికి మీ చెంతకు వచ్చాను**
- **జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్**

**కూనవరం,పెన్ పవర్,ఏప్రిల్ 16.** పోలవరం నిర్వాసితుల సమస్యలను తెలుసుకొని, పరిష్కరించడానికి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ క్రీడ మైదానం నందు జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్ ఆర్ అండ్ ఆర్ గ్రామ సభను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాసితుల అందరికీ న్యాయం చేయడానికి మీ వద్దకు వచ్చామని, ఏ ఒక్క నిర్వాసితుడు నష్టపోకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారని అన్నారు.మీకు కేటాయించిన తాడువాయి గ్రామంలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించిన తరువాతనే తరలిస్తామని,మీకు న్యాయం చేయడానికి మీ చెంతకు వచ్చానని అన్నారు.95 శాతం ఇంటి స్ట్రక్చర్ వేల్యూ వారి ఖాతాలో జమ అయ్యిందని, సొంతగా ఇల్లు నిర్మించుకునే వారు 95శాతం ముందుకు వచ్చారని, ఓటిఎస్ అనగా స్థలం వద్దు,ఇల్లు వద్దు మాకు డబ్బులు ఇవ్వండి అనేవారు 80శాతం ముందుకు వచ్చారని అన్నారు.నిర్వాసితులు మాట్లాడుతూ రేషన్ కార్డు ద్వారా బియ్యం తీసుకోవడానికి లేని అభ్యంతరం ఆర్అండ్ఆర్ కి అభ్యంతరం ఏమిటని అన్నారు. అధికారుల వద్దకు వెళ్లి మాకు న్యాయం చేయండని స్థితిలో నిర్వాసితులు ఉన్నారని జిల్లా కలెక్టర్ ముందుఆవేదన చెందుతూ మాట్లాడారు.సొంత ఊరు వదిలి త్యాగం చేసి వెళుతున్న నిర్వాసితులను చిరునవ్వుతో వెళ్లేలా అధికారులు పనిచేయాలని, బాధతో వెళ్లేలా ఉండకూడదని అన్నారు.కూనవరం గ్రామపంచాయతీ మొత్తం ఒకే చోట ఉండాలని,అన్ని సదుపాయాలు కల్పించిన తరువాతనే తరలించాలని కోరారు. మండలంలో 48 గ్రామాలు ముంపుకు గురవుతున్నాయని, మొదటి ప్రయారిటీ కింద 9 గ్రామాలనుతీసుకోవడం న్యాయం కాదని,48 గ్రామాలను ముంపుగా గుర్తించి నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు.ఒకానొక సమయంలో ప్రతిపక్షం,అధికారపక్షం నాయకుల మధ్య మాట పెరగడంతో గ్రామసభకు వచ్చిన ప్రజలు గందరగోళానికి గురయ్యారు. కలెక్టర్ దినేష్ కుమార్ చొరవ తీసుకొని మీరు మాట్లాడినప్పుడు నేను శ్రద్ధగా విన్నానని పోరాడి కొట్టుకుంటే సమస్యను పరిష్కరించడం సాధ్యం కాదని ఆయన అన్నారు.నిర్వాసితులైన 40 మందికి ఇంటి స్ట్రక్చర్ వ్యాల్యూ బ్యాంకు ఖాతాలో జమ కానీ వారు కలెక్టర్ కు ఇంటి స్ట్రక్చర్ వ్యాల్యూ కాయితాలను చూపించి మాకు న్యాయం చేయాలని కోరారు. తప్పకుండా మీకు న్యాయం చేస్తానని ఎవరు అధైర్య పడవదని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చింతూరు ఐటీడీఏ పీవో శుభం నోక్వల్,ఎస్ డి సి శ్రీనివాస రావు,తాసిల్దార్ ధర్మేందర్,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శబరినది ప్రవాహానికి కొట్టుకొని,వచ్చిన మృతదేహం

### -వి.ఆర్.పురం ఎస్.ఐ.షేక్.సాధిక్,పోలీసు సిబ్బంది.




**వి.ఆర్.పురం పెన్.పవర్.ఏప్రిల్.16**:మండలంలోనివి.ఆర్.పురం శబరినదిబ్రిడ్జికుసమీపం లోగురువారం గుర్తుతెలియని,పురుషుడు మృతదే హంశబరినది ప్రవాహానికి కొట్టుకొని,రావడంజరిగింది. ఈవిషయంతెలుసుకున్న వి.ఆర్.పురం ఎస్.ఐ.సాధిక్, పోలీసుసిబ్బంది.తోహుటాహూటీన మృతదేహంవద్ద కుచేరుకొని,పరిశీలించారు.మృతిచెందినపురుషుడు వయస్సు,సుమారు30సంవత్సరాలునుండి35సంవత్సరాలువరకు,ఉండవచ్చునని,మృతదేహంపైఉన్న షర్ట్,రంగు,చింతపిక్కరంగు,కాఖీపాయింట్,ధరించి,యున్నాడని,తెలిపారు.ఎవరైనామృతదేహంనుగుర్తు పట్టినట్లయి తేవెంటనే వి.ఆర్.పురం పోలీసువారికి తెలియజేయాలని, కోరారు.శబరినదిలో కొట్టుకొని,వచ్చిన మృతదేహంపై పోలీసులు కేసునమోదుచేసి,దర్యాప్తు చేపట్టారు.

## స్వీయ నమోదు చేసుకున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..

- సెన్సస్ 2027లో స్వీయ నమోదు కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి..



**కోరుకొండ, పెన్ పవర్, ఏప్రియల్16:** సెన్సస్-2027లో భాగంగా స్వీయ నమోదు (సెల్ఫ్ ఏనుమేరేషన్ ) ప్రక్రియను గురువారం రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ స్వయంగా నిర్వహించారు. భారతదేశ చరిత్రలో తొలిసారిగా సమగ్ర కుటుంబ సర్వేను ప్రజలే ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే విధానం అందుబాటులోకి రావడం గొప్ప ముందడుగు అని ఆయన పేర్కొన్నారు. దేశ భవిష్యత్తుకు సంక్షేమ పథకాల రూపకల్పనకు జనగణన అత్యంత కీలకమని బలరామకృష్ణ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభమైన జనగణన 2026 కార్యక్రమంలో భాగంగా రాజానగరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఈ ప్రక్రియను అధికారికంగా కోరుకొండ మండలం గాదరాడ గ్రామంలో వారి స్వగృహం వద్ద ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనగణన ద్వారా సేకరించే గణాంకాల ఆధారంగానే ప్రభుత్వం భవిష్యత్తు ప్రణాళికలు, మౌలిక సదుపాయాల కల్పన మరియు బడ్జెట్ కేటాయింపులు చేపడుతుందని ఆయన తెలిపారు. ఈసారి జనగణన పూర్తిగా డిజిటల్ పద్ధతిలో జరుగుతోందని తద్వారా త్వరితగతిన ఫలితాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు.గణాంక సేకరణ అధికారులు ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు వారికి సహకరించి సరైన వివరాలు అందించాలని కోరారు. అందించిన వ్యక్తిగత సమాచారం అత్యంత గోప్యంగా ఉంటుందని, దీనివల్ల ఎటువంటి సంక్షేమ పథకాలకు ఆటంకం కలగదని ఆయన స్పష్టం చేశారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ కుటుంబ వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని ఇది ప్రభుత్వానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించడంలో ఉపయోగపడుతుందని తెలిపారు.

# పంజాబ్ vs ముంబై మధ్య కీలక పోరు..
# ఏ జట్టు గెలుస్తుందో తెలుసా!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026లో నేడు అసలైన మజా షురూ కానుంది! ఒకవైపు వరుస విజయాలతో 'అన్‌స్టాపబుల్'గా దూసుకెళ్తున్న పంజాబ్ కింగ్స్ , మరోవైపు తన సొంత గడ్డపై ఫామ్ కోసం వెతుకుతున్న ముంబై ఇండియన్స్ . ఈ రోజు రాత్రి ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరగనున్న ఈ మ్యాచ్ గత ఏడాది క్వాలిఫైయర్-- 2 పోరును గుర్తుకు తెస్తోంది.

**పిచ్ రిపోర్ట్:**

వాంఖడే పిచ్ ఎప్పుడూ బ్యాటర్లకు స్వర్గధామం.. ఈ సీజన్‌లో ఇక్కడ జరిగిన గత రెండు మ్యాచ్‌ల్లోనూ ఇరు జట్లు 220 పరుగుల మార్కును దాటాయి. గత మ్యాచ్‌లో ఇక్కడ 462 పరుగులు నమోదయ్యాయి. ఈ రోజు కూడా స్టేడియంలో బౌండరీల వర్షం కురిసే అవకాశం ఉంది. ఇక్కడ ఛేజింగ్ చేయడం సులభం కాబట్టి, టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఉంది.

**విజేత ఎవరంటే!:**

ప్రస్తుత ఫామ్ ప్రకారం పంజాబ్ కింగ్స్ గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని పంజాబ్ జట్టు ఇప్పటి వరకు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. పంజాబ్ ప్రస్తుతం 3 విజయాలతో 3వ స్థానంలో ఉండగా, ముంబై కేవలం ఒక్క విజయంతో 9వ స్థానంలో ఉంది. ఈ రోజు పంజాబ్ గెలిస్తే పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకునే అవకాశం ఉంది.

**ముఖ్యమైన ఆటగాళ్లు:**

సూర్యకుమార్ యాదవ్: పంజాబ్‌పై సూర్యకు మంచి రికార్డు ఉంది. ఇప్పటివరకు వారిపై 606 పరుగులు చేశాడు (స్ట్రైక్ రేట్ 156.58). వాంఖడేలో అతని స్ట్రైక్ రేట్ 187.50గా ఉండటం విశేషం. నేటి మ్యాచ్‌లో అతను టాప్ స్కోరర్‌గా నిలిచే అవకాశం ఉంది.

శ్రేయస్ అయ్యర్: పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. 4 మ్యాచ్‌ల్లో 137 పరుగులు చేశాడు. బుమ్రా బౌలింగ్‌లో అయ్యర్‌కు మంచి రికార్డు ఉంది (కేవలం ఒకసారి మాత్రమే అవుట్ అయ్యాడు).

**తుది జట్ల అంచనా:**

ముంబై ఇండియన్స్: ర్యాన్ రికెల్టన్, క్వింటన్ డి కాక్ (వికెట్ కీపర్),ం

సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా (కెప్టెన్), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, నమన్ ధీర్, మిచెల్ సాంట్నర్, శార్దూల్ ఠాకూర్, దీపక్ చాహర్, జస్ప్రీత్ బుమ్రా.

**ఇంపాక్ట్ ప్లేయర్: అశ్వని కుమార్**

పంజాబ్ కింగ్స్: ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), కూపర్ కానలీ, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), నెహాల్ వధేరా, మార్కస్ స్టోయినిస్, శశాంక్ సింగ్, మార్కో జాన్సెన్, జేవియర్ బార్ట్లెట్, వైశాఖ్ విజయ్‌కుమార్, అర్ష్‌దీప్ సింగ్.

ఇంపాక్ట్ ప్లేయర్: యుజ్వేంద్ర చాహల్

# ఏకంగా స్టేడియంలోనే డ్యాన్స్ చేసిన రోహిత్ శర్మ..



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026లో భాగంగా వాంఖడే స్టేడియంలో ఈరోజు పంజాబ్ కింగ్స్ వర్సెస్ ముంబై ఇండియన్స్ మధ్య జరగనున్న కీలక మ్యాచ్ కి రంగం సిద్ధమైంది. ఇక మ్యాచుకి ముందు రోహిత్ శర్మకి సంబంధించిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వాంఖడే స్టేడియంలో బుధవారం జరిగిన ఫిట్‌నెస్ డ్రిల్ సమయంలో రోహిత్ సరదాగా డ్యాన్స్ చేస్తూ కనిపించడం నెటిజన్లను తెగ ఆకట్టుకుంటోంది.

**రోహిత్ గాయంపై ఉత్కంఠ:**

గత ఆదివారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ)తో జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తున్న సమయంలో రోహిత్ శర్మ హ్యామ్‌స్ట్రింగ్ గాయంతో మైదానాన్ని వీడాల్సి వచ్చింది. ఇక మంగళవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌కు కూడా అతను దూరంగా ఉండటంతో, పంజాబ్‌తో జరిగే కీలక మ్యాచ్‌లో రోహిత్ ఆడతాడా లేదా అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. కానీ తాజాగా వైరల్ అయిన వీడియోలో రోహిత్ శర్మ తన మోకాళ్లను ఛాతీ వరకు ఎత్తుతూ చేసే వ్యాయామం (ఖీఊఅవం ఐతీఅశ్రీశ్రీ) చేస్తూ, మధ్యలో ఫన్నీగా డ్యాన్స్ చేయడం కనిపించింది. ఇది చూసి అభిమానులు మురిసిపోతున్నప్పటికీ, మరో అంశం వారిని ఆందోళనకు గురి చేస్తోంది. ఇక డ్యాన్స్ చేస్తున్న ఆ వీడియోలో రోహిత్ తన తొడ భాగంలో బ్యాండేజ్ చుట్టుకుని ఉండటం స్పష్టంగా కనిపిస్తోంది.

**పంజాబ్ మ్యాచ్‌లో ఆడతాడా?:**

రోహిత్ శర్మ ప్రాక్టీస్‌లో హుషారుగా కనిపించినప్పటికీ, గాయం ఇంకా పూర్తిగా తగ్గలేదని ఆ బ్యాండేజ్ సూచిస్తోంది. ఒకవేళ ముంబై ఇండియన్స్ మేనేజ్‌మెంట్ రిస్క్ తీసుకోవద్దని భావిస్తే, రోహిత్ స్థానంలో డానిష్ మలేవార్ లేదా రాబిన్ మింజ్ ఓపెనర్లుగా వచ్చే అవకాశం ఉంది. టాస్ పడే వరకు హిట్ మ్యాన్ తుది జట్టులో ఉంటాడో లేదో వేచి చూడాల్సిందే.

# సన్ రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా ఇషాన్ కిషన్ ఔట్.. ఆ మ్యాచ్‌కి కెప్టెన్ సాబ్ ఎంట్రీ



**హైదరాబాద్ పెన్ పవర్:** సన్ రైజర్స్ హైదరాబాద్ టీంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో రెండో విజయం నమోదు చేసుకున్న ఆరెంజ్ ఆర్మీ ఈ నెల 18న ఉప్పల్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరగబోయే కీలక మ్యాచ్‌కు ముందు జట్టులో పలు మార్పులు చేసింది. జట్టులో కీలక ఆటగాడు గాయం కారణంగా దూరమయ్యాడు. ఆ స్థానంలో మరో బౌలర్ ఎంట్రీ ఇచ్చాడు. కాగా, ఇషాన్ కిషన్ సారథ్య బాధ్యతల నుంచి తప్పుకునే ఛాన్స్ ఉంది.

సన్ రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ గా కొనసాగుతున్న ఇషాన్ కిషన్ ఆ బాధ్యతల నుంచి తప్పుకొనే టైం వచ్చింది. ఇదే సమయంలో జట్టులోనూ మార్పులు జరిగే ఛాన్స్ ఉంది. ఇంగ్లాండ్ ఫాస్ట్ బౌలర్ బ్రైడన్ కార్స్ గాయంతో ఈ సీజన్ మొత్తానికే దూరం కాగా, అతడి స్థానంలో యాజమాన్యం శ్రీలంక యువ లెఫ్ట్ ఆర్మ్ పేసర్ దిల్షాన్ మధుశంకను రూ. 75 లక్షలకు తుది జట్టులోకి తీసుకుంది. మధుశంక స్వింగ్ బౌలింగ్ తో బ్యాటర్లను ముప్ప తిప్పలు పెట్టగలడు. కాగా, ఫిట్‌నెస్ సమస్యలతో ఫస్ట్ హాఫ్ మ్యాచ్‌లకు దూరమైన కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కూడా తిరిగి జట్టులోకి వస్తున్నట్లు తెలుస్తుంది. ఆస్ట్రేలియాలో ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకుని, ఈ నెల 25వ తేదీన రాజస్థాన్ రాయల్స్‌తో జరిగే మ్యాచ్‌కు అతడు అందుబాటులోకి వచ్చే ఛాన్స్ ఉంది. అన్ని జట్లకి మింగుడు పడని రాజస్థాన్ రాయల్స్ ను ఓడించిన సన్ రైజర్స్ హైదరాబాద్ కు తిరిగి కమిన్స్ కెప్టెన్ గా వ్యవహరించనున్నాడు. సన్ రైజర్స్ తదుపరి మ్యాచ్ సొంతగడ్డపై చెన్నై సూపర్ కింగ్స్? ను ఢీ కొట్టనుంది. వెన్నుగాయం కారణంగా కొన్ని రోజుల నుంచి కమిన్స్? ఆటకు దూరంగా ఉంటున్నాడు. సన్ రైజర్స్ ప్లే ఆఫ్స్ చేరాలంటే మిగిలిన 9 మ్యాచుల్లో కనీసం 7 మ్యాచులలో నెగ్గాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక కమిన్స్ కెప్టెన్ గా తిరిగి రావటం జట్టుకు అదనపు బలంగా మారబోతుంది.



పవర్‌ఫుల్ గ్లామ్ అప్పీల్‌తో రీగల్ లెహంగా లుక్‌లో నుష్రత్ భరుచ్చా స్టన్స్

# రానా దగ్గుపాటి : టాలీవుడ్ హీరోలు టీచర్లు అయితే ఏ సబ్జెక్ట్ చెబుతారో తెలుసా?



టాలీవుడ్ భల్లాలదేవ రానా దగ్గుబాటి అంటే కేవలం నటన మాత్రమే కాదు, తనదైన చమత్కారంతోనూ అందరినీ ఆకట్టుకుంటారు. గతం లో ఒక మూవీ ఫంక్షన్‌లో యాంకర్ సుమ అడిగిన ప్రశ్నలకు రానా అదిరిపోయే సమాధానాలు ఇచ్చారు. మన టాలీవుడ్ స్టార్ హీరోలు ఒకవేళ టీచర్లు అయితే ఏ సబ్జెక్టులు బోధిస్తారనే అంశంపై రానా చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఆ సరదా ముచ్చట్లు ఏంటో ఒకసారి చూద్దాం..

**రాజమౌళి – ఆల్ ఇన్ వన్ టీచర్:**

దర్శకధీరుడు రాజమౌళి గురించి రానా చెబుతూ.. ఆయన అన్ని సబ్జెక్టులు నేర్పించగల సమర్థుడని పేర్కొన్నారు. స్కూల్ అయిపోయాక సాయంత్రం వేళ మనం వెళ్లే 'స్పెషల్ ట్యూషన్ టీచర్' లాగా రాజమౌళి గారు ఉంటారని చమత్కరించారు. అంటే ఏ సందేహం వచ్చినా, ఏ విషయంలోనైనా క్లారిటీ ఇవ్వడంలో రాజమౌళి తర్వాతే ఎవరైనా అని రానా ఉద్దేశ్యం. సినిమా అనే స్కూల్‌లో ఆయన ఒక హెడ్ మాస్టర్ లాంటి వారని రానా మాటలను బట్టి అర్థమవుతోంది.

**చరణ్, ప్రభాస్‌ల స్పెషల్ క్లాసులు:**

ఇక రామ్ చరణ్ గురించి మాట్లాడుతూ.. చరణ్‌కు గుర్రపు స్వారీ అంటే ఎంతో ఇష్టమని, అందుకే ఆయన అందరికీ 'హార్స్ రైడింగ్' నేర్పిస్తే బాగుంటుందని రానా చెప్పారు. అలాగే గ్లోబల్ స్టార్ ప్రభాస్ గురించి చెబుతూ.. ఆయన బిహేవియరల్ అండ్ కల్చరల్ క్లాసులు తీసుకోవాలని సూచించారు. అందరితో ఎంతో మర్యాదగా, ప్రేమిస్తూ, హ్యాపీగా ఎలా ఉండాలో ప్రభాస్ కంటే బాగా ఎవరూ నేర్పించలేరని రానా కొనియాడారు. డార్లింగ్ వ్యక్తిత్వం అలాంటిది మరి.

**అనుష్క మంచితనం.. ఎన్టీఆర్ తెలుగు:**

అనుష్క శెట్టి గురించి రానా చెబుతూ ఒక ఆసక్తికరమైన ఉదాహరణ ఇచ్చారు. జపాన్‌లోని స్కూల్స్‌లో పిల్లలకు మనుషులతో ఎలా మాట్లాడాలి, ఇల్లు ఎలా శుభ్రంగా ఉంచుకోవాలి వంటి లైఫ్ స్కిల్స్ నేర్పిస్తారని, అలాంటి 'మంచితనం' నేర్పించడానికి అనుష్క సరైన వ్యక్తి అని చెప్పారు. ఇక జూనియర్ ఎన్టీఆర్ విషయానికి వస్తే, ఆయన 100% పక్కా 'తెలుగు టీచర్' అని రానా తేల్చేశారు. తారక్ మాట్లాడే స్వచ్ఛమైన తెలుగును వింటే ఎవరైనా సరే ఆయనకు ఈ సబ్జెక్ట్ ఇచ్చేయాల్సిందే. ఒక చిన్న రాపిడ్ ఫైర్ రౌండ్‌లో రానా చెప్పిన ఈ విషయాలు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రతి హీరో వ్యక్తిత్వానికి, వారికున్న ఇష్టాలకు అనుగుణంగా రానా సబ్జెక్టులను ఎంచుకున్న తీరు చూసి ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. "రానా గారు పక్కాగా గెస్ చేశారు" అంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ వర్షం కురుస్తోంది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, తన తోటి నటీనటుల గురించి రానాకు ఉన్న అవగాహన చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఈ వీడియో మీరు కూడా చూశారా? ముగింపుగా చెప్పాలంటే.. మన స్టార్ హీరోలు ఒకవేళ నిజంగా టీచర్లు అయితే ఆ స్కూల్స్ అన్నీ హౌస్ ఫుల్ అవ్వడం ఖాయం!



హెబ్బా పటేల్ సొగసైన బ్లాక్ లేస్ లుక్‌లో మెరిసింది

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At FLAT NO. 31, RAJEEV NAGAR, VISAKHA A COLONY, NEAR JAMATHOTA, KILLIPALEM PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. "PEN POWER" vide PRGI Registration No. "APTEL/25/A4918" Editor: GANTYADA APPARAO. e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. Editor GANTYADA APPARAO.e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965